
# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com



తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | బుధవారం | 25.12.2024 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం


## అదానీ పెట్టుబడుల ఒప్పందాలను
# వెంటనే రద్దు చేయలేం

- అదానీ పెట్టుబడులను వెంటనే రద్దు చేయడం సాధ్యం కాదు
- గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను సింగిల్ స్ట్రోక్‌తో రద్దు చేసే పరిస్థితి ఉండదు
- మోడీ ప్రధాని అయ్యాక ప్రైవేటు వ్యక్తుల పెట్టుబడులు పెరిగాయి
- సీఎం రేవంత్ రెడ్డి
- ముల్కీ రూల్స్ నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు పుస్తకం
- తెలంగాణ బిల్లు ఆమోదంలో జైపాల్ రెడ్డిది కీలక భూమిక
- యాదవరెడ్డి పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ప్రజాభూమి

ముల్కీ రూల్స్ పోరాటం నుంచి నేటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ప్రత్యేక పరిణామ ఘట్టాలపై కూడా పుస్తకం తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో జైపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. జైపాల్ రెడ్డి, యాదవ రెడ్డి తెరవెనక రాజకీయం నడిపారని అన్నారు. తెలంగాణ ఏర్పాటుపై తెర వెనక జరిగిన కీలక విషయాలు ప్రజలకు తెలియాలని మిగతా 2లో...

## వాజ్‌పేయ్ శతజయంతి వేళ..
# ఎన్డీఏ ప్రత్యేక భేటీ

- నడ్డా నివాసంలో సమావేశంకానున్న నేతలు
- తాజా రాజకీయ పరిణామాలపై చర్చ



న్యూఢిల్లీ,ప్రజాభూమి

దివంగత ప్రధాని వాజ్‌పేయి జనయంతిని పురస్కరించుకుని అధికార ఎన్డీయే కూటమి భాగస్వామ్యపక్షాలు బుధవారం దిల్లీలో భేటీ కానున్నాయి. దివంగత నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి వేడుకల నేపథ్యంలో ఎన్డీయే నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించనున్నారు. అనంతరం భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో బుధవారం సాయంత్రం 4గంటలకు భేటీ కానున్నట్లు సమాచారం. దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనల, తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. ఈ కీలక భేటీకి తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మిగతా 2లో...

# ముగిసిన అల్లు అర్జున్ విచారణ

- తండ్రి అరవింద్‌తో కలిసి హాజరైన బన్ని
- అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ రికార్డు
- మళ్లీ పిలిస్తే అందుబాటులో ఉండాలన్న పోలీసులు

2లో



## అంబేడ్కర్‌ను అవమానించిన
## అమిత్‌షాను మంత్రి వర్గం నుండి తొలగించాలి

ఖమ్మం నిరసన కార్యక్రమంలో
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్

ఖమ్మం,ప్రజాభూమి

అంబేద్కర్ అవమానించిన, ఈ దేశ రాజ్యాంగాన్ని అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోనూ అమిత్ షా వాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నిరసన ర్యాలీ నిర్వహించింది. నిరసన ర్యాలీలో రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో...



## చదువుకున్న మహిళలకు
# వర్క్‌ఫ్రమ్ హోమ్

- గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచే లక్ష్యం
- వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్లతో మహిళలకు అవకాశం
- గృహిణులుగా మిగిలి పోకుండా మహిళలకు ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం



అమరావతి,ప్రజాభూమి

గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచడం, వ్యాపార, ఉపాధి అవకాశాలు పెంచడం కోసం కొన్ని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఇందులో భాగంగా ఒకే చోట కలిసి పని చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనుంది. కో వర్కింగ్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయాలని మిగతా 2లో...

## కొత్త సంవత్సరంలో
# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- ఇప్పటి వరకు 32 లక్షల కుటుంబాల సర్వే పూర్తి
- మొబైల్ యాప్‌లో లబ్దిదారుల పేర్లు నమోదు
- గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్,ప్రజాభూమి

కొత్త సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వేలో వేగం పెరిగిందని, ఇప్పటి వరకు 32 లక్షల కుటుంబాల సర్వే పూర్తి చేసి మొబైల్ యాప్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నంబరు అందుబాటులోకి తీసుకొస్తామని పొంగులేటి చెప్పారు. జిల్లాకు 2లో..

# సంధ్య థియేటర్ ఘటన యాదృచ్ఛికం

- ఎవరూ కావాలని ఇలాంటి ఘటనను కోరుకోరు
- పరిశ్రమకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటా
- సీఎం రేవంత్‌తో కలిసి అన్ని విషయాలు చర్చిస్తా
- రేవతి కుటుంబానికి అండగా నిలబడతాం
- కిమ్స్‌లో శ్రీతేజ్‌ను పరామర్శించిన దిల్ రాజు
- అర్జున్‌పై కేసు సరికాదన్న రేవతి భర్త భాస్కర్

2లో



## దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాల
# నిర్వహణకు కమిటీ

- స్విమ్స్ హాస్పిటల్‌కి జాతీయ హోదా కోసం కేంద్రానికి వినతి
- భక్తులకు దర్శనం, వసతి సౌకర్యాల్లో ఇబ్బంది లేకుండా చర్యలు
- తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం ఏర్పాటుకు నిర్ణయం
- అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బంది
- కంచి పీఠం పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయింపు
- ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు
- తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల,ప్రజాభూమి

తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. స్విమ్స్ హాస్పిటల్‌కి జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. తిరుమల పర్యటనలో మిగతా 2లో...

## దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాల నిర్వహణకు కమిటీ

మొదటిపేజీ తరువాయి

భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.తిరుమలలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని, తగినంత సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించినట్టు ఈవో చెప్పారు. తిరుమలకు వచ్చే భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్‌బ్యాక్‌ను ఏపీ డిజిటల్ సహకారంతో స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో ఉన్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తున్నామని అన్నారు. అన్నప్రసాదంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు ప్రకటించారు..కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుమలలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులు సౌకర్యార్థం క్యూ కాంప్లెక్స్ వద్ద రూ.3.6 కోట్లతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల..శారదా పీఠానికి కేటాయించిన మఠం లీజు రద్దు చేయడానికి నోటీసులు జారీ చేశామని అన్నారు. మఠం నిర్వాహకులు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తులకు అందించే సేవలపై, వారి సమస్యలను తెలుసుకునేందుకు ఫీడ్ బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుమలలో వున్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తామని తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని.. అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తామని టీటీడీ ఈవో తెలిపారు. మీడియా సమావేశంలో ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా పాల్గొన్నారు.

### వాజ్‌పేయ్ శతజయంతి వేళ..

## ఎన్డీఏ ప్రత్యేక భేటీ

మొదటిపేజీ తరువాయి

సహా ఎన్డీయే పక్షాలకు చెందిన నేతలు హాజరుకానున్నారు.రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం నెలకొంది. దీంతో ఈ అంశంపై ఎన్డీయే మిత్రపక్షాల మధ్య మరింత మెరుగైన సమన్వయం సాధించడంతో పాటు కాంగ్రెస్‌కు గట్టిగా సమాధానం చెప్పే విషయంపైనా ఎన్డీయే మిత్రపక్షాల నేతలు చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయించిన జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లుల విషయంలో అనుసరించాల్సిన వ్యూహాలు, వచ్చే ఏడాదిలో దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో కూటమి పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు వంటి పలు అంశాలపైనా ఈ భేటీలో చర్చించే అవకాశం ఉంది. ఇటీవల పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ(ఖఓ ఓనీటతి) ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మధ్య మరింత సమన్వయం పెంపొందించేం దుకు వీలుగా ప్రతి నెలా సమావేశం కావాలని సూచించిన విషయం తెలిసిందే.

## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి వర్గం నుండి తొలగించాలి

మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయన్నారు. నిండు సభలో ఈ దేశ రాజ్యాంగాన్ని దేశానికి మార్గదర్శకులుగా నిలిచిన అంబేద్కర్‌ను అవమానించిన అమిషాపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలో భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్నదంటే అందుకు ఈ దేశ రాజ్యాంగమే ప్రధాన కారణమని చెప్పుకొచ్చారు. అంబేద్కర్ వంటి మహనీయులు.. ఈ దేశంలో ప్రతి ఒక్క పౌరుడు గర్వంగా తిరిగేలా స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కుల మతాలకతీతంగా ప్రాంతాలకు అతీతంగా నేడు దేశంలో ప్రతి ఒక్క పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నారని.. ఇందుకు మన రాజ్యాంగమే ప్రధాన కారణమని చెప్పారు. ఈ హక్కులను కాల రాయాలని ఈ రాజ్యాంగాన్ని ఉల్లంఘించాలని భారతీయ జనతా పార్టీ ఎన్నో కుట్రలు కుతంత్రాలు చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపైన దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ దేశానికి హోం మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## కొత్త సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

ఒక ప్రాజెక్టు డైరెక్టర్‌ను నియమించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినప్పటికీ నాలుగేళ్లలో 20లక్షల ఇళ్లు నిర్మించి తీరుతామని మంత్రి పునరుద్ఘాటించారు.హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ డిపార్ట్ మెంట్‌ను పూర్తిగా పక్కకు పెట్టిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తప్పులు దొర్లకుండా నిజమైన ఇందిరమ్మ లబ్ధి దారులను ఎంపిక చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లాకో స్పెషల్ ఆఫీసర్‌ను నియమించామని గుర్తుచేశారు. మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లు ఇస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక సర్వేపై అధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో 33 జిల్లాల నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,000 మంది సిబ్బందితో యాప్ ద్వారా లబ్దిదారుల ఎంపిక పక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. నిన్నటి వరకు 30 లక్షల పైచిలుకు అప్లికేషన్ల సర్వే పూర్తి అయినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలన జనవరి మొదటి వారానికి పూర్తవుతుందన్నారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిచేసి సంక్రాంతి నాటికి ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన హౌసింగ్ కార్పొరేషన్‌ను తిరిగి బలోపేతం చేస్తున్నామని.. వివిధ విభాగాల్లో ఉన్న కార్పొరేషన్ ఉద్యోగులను 95శాతం వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించడానికి అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై త్వరలో విధివిధానాలు ప్రకటించనున్నట్లు పొంగులేటి తెలిపారు.

# సంధ్య థియేటర్ ఘటన యాదృచ్ఛికం

హైదరాబాద్,ప్రజాభూమి

సంధ్య థియేటర్ ఘటన ఎవరూ కావాలని చేసింది కాదని, అది ప్రమాదవశాత్తు జరిగిందని ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు అన్నారు. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం దూరం పెడుతోందనేది దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. చిత్రపరిశ్రమకు అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం రేవతం÷– రెడ్డి ఇప్పటికే అన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. త్వరలోనే సినీ పరిశ్రమ ప్రతినిధులం వెళ్లి సీఎంను కలుస్తామని అన్నారు.. ఎలాంటి సమస్యలు రాకుండా చూసే బాధ్యత నాపై ఉంది‘ అని దిల్ రాజు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టంభన రాకుండా చూస్తానని అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి అండగా ఉంటామని కూడా దిల్ రాజు ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను నిర్మాత దిల్ రాజు మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ‘ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. సీఎం రేవంత్ రెడ్డి నన్ను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించారు. నేను అమెరికాలో ఉన్నందున ఇన్ని రోజులు రాలేకపోయా. అమెరికా నుంచి రాగానే ముఖ్యమంత్రిని కలిశా. అల్లు అర్జున్‌ను త్వరలోనే కలుస్తా. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తున్నా. దానికి త్వరలోనే ఫుల్‌స్టాప్ పెడదాం. సినీ పరిశ్రమ వారితోపాటు ప్రభుత్వ పెద్దలను త్వరలోనే కలిసి షరిష్కారం చూపే ప్రయత్నం చేస్తా. చిత్ర పరిశ్రమ, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటా. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం. రేవతి భర్త భాస్కర్‌కు ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి మెరుగవుతోంది. మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారని వివరించారు. నిర్మాతతో తోపాటు డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి బాలుడిని పరామర్శించారు. శ్రీతేజ్ రికవరీ అవుతున్నాడని తెలిపాడు. రేవతి మరణం పట్ల బాధను వ్యక్త పరిచారు. కావాలని ఎవరు ఇలాంటి ఘటనలకు పాల్పడరని తెలిపారు. అలాగే రేవతి కుటుంబం కూడా వినోదం కోసమే థియేటర్‌కు వెళ్లారని అన్నారు. రేపు లేదా ఎల్లుండి సీఎం రేవంత్‌ను కలుస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు ఛైర్మన్‌గా బాధ్యత తీసుకుంటా అని అన్నారు. ఇటీవల తెలుగు సినిమా పరిశ్రమను మరింత పెద్దదిగా చేయటమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ఆలోచనలు ఉన్నాయని దిల్ రాజు చెప్పుకొచ్చారు. నిజానికి 2014లోనే టాలీవుడ్ అభివృద్ధికి భూములు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా.. దశాబ్ద కాలంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కానీ గతేడాది సీఎం రేవంత్ రాకతో ఆగిపోయిన నంది అవార్డులను గద్దర్ అవార్డుల పేరుతో తిరిగి ప్రారంభిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నుంచి గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందని.. కమిటీతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని ఈ సందర్భంగా దిల్ రాజు ప్రకటించారు. ఇదిలావుంటే సంధ్య థియేటర్ తొక్కిసలాట బాధితుడు శ్రీతేజ్ తండ్రి భాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం శ్రీతేజ్ కోలుకుంటున్నాడని... ఇప్పుడిప్పుడే ట్రీట్మెంట్ కి పాజిటివ్ గా రెస్పాండ్ అవుతున్నాడని, కళ్ళు తెరచి చూస్తున్నాడని అన్నారు. తమ వల్ల అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడం ఇష్టం లేదని.. అల్లు అర్జున్ పై పెట్టిన కేసు వాపసు తీసుకుంటానని అన్నారు. ప్రభుత్వం నుండి కోమటిరెడ్డి హామీ ఇచ్చారని.. అల్లు అర్జున్ రూ. 25లక్షలు ప్రకటించారని.. ఇప్పటికి రూ. 10లక్షలు ఇచ్చారని అన్నారు. మైత్రి మూవీస్ వారు రూ. 50లక్షలు ఇచ్చారని.. సుకుమార్ ఫ్యామిలీ కూడా అండగా ఉందని అన్నారు.

ఇదిలా ఉండగా.. హాస్పిటల్ కి వెళ్లి శ్రీతేజ్ కుటుంబాన్ని పరామర్శించిన నిర్మాత దిల్ రాజు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఇదిలా ఉండగా.. సంధ్య థియేటర్ ఘటన రిమాండ్ రిపోర్టులో నిందితుల లిస్ట్ ను పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో అల్లు అర్జున్ ను ఏ11 గా చేర్చిన పోలీసులు.. ఏ 18గా పుష్ప నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ నిర్మాతను చేర్చారు. ఏ1 నుంచి ఏ8 వరకు థియేటర్ యజమానులు, మేనజర్ ను చేర్చారు. ఏ9 ,ఏ 10 గా సంధ్య థియేటర్ సెక్యూరిటీ, మేనేజర్ ను చేర్చారు.

# ముగిసిన అల్లు అర్జున్ విచారణ

హైదరాబాద్,ప్రజాభూమి

చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్ విచారణ ముగిసింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిస లాటపై మూడు గంటలు పాటు విచారణ చేసిన పోలీసులు.. అల్లు అర్జున్‌ను 20 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్ మెంట్‌ను రికార్డ్ చేశారు. అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని.. అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు పోలీసులు తెలిపారు. పోలీసులు సేకరించిన వీడియోలు, సిసి ఫుటేజ్‌ను ముందు పెట్టి అల్లు అర్జున్‌ను విచారించారు. ఇదిలాఉండగా.. అల్లు అర్జు÷–న్‌కు కోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు కోరనున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడారని.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులో బెయిల్ రద్దు చేయాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, విచారణ అనంతరం అల్లు అర్జున్ చిక్కడపల్లి పీఎస్ నుంచి జూబ్లీహిల్స్ నివాసానికి బయలుదేరారు. ఎస్కార్ట్ వాహనంతో చిక్కడపల్లి పీఎస్ నుంచి తన ఇంటికి వెళ్లారు.సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ మంగళవారం ఉదయం 11 గంటలకు తన తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అల్లు అర్జున్ లాయర్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసు కూడా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ విచారణలో అల్లు అర్జున్‌ను మధ్యాహ్నం 2.47 గంటల వరకు విచారించారు. ఈ విచారణలో ఏసీపీ రమేష్ కుమార్ కీలకంగా వ్యవహరించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన జరిగినపుడు రమేష్ కుమార్ కుమార్ అక్కడే ఉన్నారు. చిక్కడపల్లి డివిజన్‌కు సంబంధించి ఎల్ రమేష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ రమేష్ కుమార్ పరిధిలోకి వస్తాయి. ఘటన జరిగిన సమయంలో స్పాట్‌లోనే ఉండడంతో రమేష్ కుమార్ ఈ విచారణలో కీలకంగా మారారు. అసలు ఈ రోజు థియేటర్‌లో ఏం జరిగిందో ఆదివారం ఆయన కళ్లకు కట్టినట్టు వివరించారు. ఘటన జరిగిన రోజు తామంతా సంధ్య థియేటర్ దగ్గరే ఉన్నామని, రేవతి చనిపోయిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పడానికి వెళితే అతడి మేనేజర్ అడ్డుకున్నాడని తెలిపారు. డీసీపీ ఆదేశాల మేరకు తాను అల్లు అర్జున్ దగ్గరకు కష్టపడి చేరుకుని విషయం చెప్పానని, ఇంటికి వెళ్లిపోవాల్సిం దిగా విజ్ఞప్తి చేశానని, అయితే సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ తనకు చెప్పారని ప్రెస్‌మీట్‌లో రమేష్ వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు అర్జున్ కేసు విషయంలో హైకోర్టు సీనియర్ న్యాయ వాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ.. ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందు కు కుట్రలు చేస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాదు.. హీరో అల్లు అర్జున్ వెను ఓ మహా శక్తి ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే అల్లు అర్జున్ కేసు వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లోనే గాక.. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. సమసిపోయిందనుకున్న వ్యవహారం.. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించడం, ఆ వెంటనే అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టడంతో మరింత రచ్చ క్రియేట్ అయ్యింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాడు చిక్కడపల్లి పోలీసులు.. హీరో అల్లు అర్జున్‌ను పీఎస్‌కు పిలిచి మరీ విచారించారు. పుష్ప సినిమాలో చేసినట్లుగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను కుప్ప కూల్చాలని చూస్తున్నట్లు తెలిపారు. గడిచిన 24 గంటలుగా పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. అల్లు అర్జున వెనుక ఓ శక్తి ఉందన్నారు. రేపటి నుంచి వారం రోజుల్లో రేవంత్ సర్కార్‌ను కూల్చడానికి పెద్ద ప్లాన్ వేశారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఈ వారం రోజుల్లోనే బీఆర్ఎస్, బీజేపీలు తాము అనుకున్న పనిని చేయాలను కుంటున్నాయని ఆరోపిపంచారు. అల్లు అరవింద్ ఫ్యామిలీని కాపాడటానికి ప్రతిపక్షాలు ఉన్నాయని.. పక్క రాష్ట్రాల నుంచి సైతం అల్లు అర్జున్‌కు మద్దతిస్తున్నారని చెప్పుకొచ్చారు. కానీ, బాధిత కుటుంబానికి అండగా నిలబడాల్సింది తెలంగాణ సమాజమేనని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. వీరికి అండగా నిలిచిన వారే నిజమైన తెలంగాణ వాదులు అని పేర్కొన్నారు. సినిమా ఇండస్ట్రీ పక్షాన నిలబడిన వారు తెలంగాణ ద్రోహులుగా మిగిలి పోతారంటూ అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు చేసినందుకు తనపై ఎలాంటి కేసులు పెట్టినా ఎదుర్కొంటానని ప్రకటించారు.

## చదువుకున్న మహిళలకు వర్క్‌ఫ్రమ్ హోమ్

మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. చదువుకున్న మహిళలు గృహిణులుగా మిగిలిపోకూడదని, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయి. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని.. వారికి వర్క్ ఫ్రం హోమ్ అందుబాటులోకి తెస్తే ఆన్‌లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతమంది వర్క్ ఫ్రం హోమ్‌లో పనిచేస్తున్నారు, వారి అవసరాలు ఏమిటనే సమాచారం సేకరించాలని అధికారులకు సీఎం సూచించారు. అదే విధంగా ఇప్పటికే నిర్ణయించినట్లు రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో 5 చోట్ల భవనాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పరిశ్రమలను, విద్యా సంస్థలను ఇన్నోవేషన్ హబ్‌లకు అనుసంధానం చేయాలని సీఎం నిర్దేశిరచారు.

## కాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- లోయలో పడ్డ ఆర్మీవాహనం
- ఐదుగురు జవాన్ల మృతి



శ్రీనగర్,ప్రజాభూమి

జమ్మూకాశ్మీర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. 300 అడుగుల లోయలో ఆర్మీ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 5 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న జమ్మూకాశ్మీర్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.మంగళవారం జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్‌లో ఆర్మీ ట్రక్కు రోడ్డుపై వెళ్తుండగా హఠాత్తుగా అదుపు తప్పి 300 అడుగుల లోయలో పడిపోయినట్లుగా సమాచారం. ఘటనాస్థలిలో ఐదుగురు సైనికులు మరణించగా, పలువురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని బనోయికి ఆర్మీ వాహనం వెళ్తుండగా ఘరోవా ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన మృతులకు ఇండియన్ ఆర్మీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఎక్స్ ట్విట్టర్‌లో సానుభూతిని తెలియజేసింది. సహాయక చర్యలు కొనసాగు తున్నాయని, గాయపడిన సిబ్బందికి వైద్యసేవలు అందిస్తున్నామని ఆర్మీ తెలిపింది.

## ప్రముఖుల క్రిస్మస్ శుభాకాంక్షలు

హైదరాబాద్,ప్రజాభూమి

క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రజలకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి శ్రేయస్కరం అన్నారు. అవి ఎప్పటికీ అనుసరణీయమని అన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాపులను సైతం క్షమించిన క్రీస్తు మానవాళికి ఆదర్శం అని పేర్కొన్నారు. విద్వేషాన్ని వీడి వివేకంతో జీవించాలనేదే క్రీస్తు బోధనా సారాంశం అని చెప్పారు. విశ్వశాంతిని కాంక్షించే పరోపకారులకు యేసు బోధనలు అనుసరణీయం అని పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ మైనార్టీలకు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని కెసిఆర్ గుర్తు చేశారు. సర్వమత సమానత్వాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించింది.. క్రిస్మస్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని కేసీఆర్ తెలిపారు.

### అదానీ పెట్టుబడుల ఒప్పందాలను

# వెంటనే రద్దు చేయలేం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ముల్కీ, నాన్ ముల్కీ నుంచి 2014 తెలంగాణ ఉద్యమం వరకు చరిత్ర తెలియాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ నేపధ్యాన్ని పుస్తక రూపంలో తేవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ అన్నారు. యుద్ధం వద్దు - శాంతి ముద్దు అంటూ అఖిల భారత శాంతి, సహృద్భావన సంస్థ మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ ఎమ్మెల్సీ కొంపెల్లి యాదవరెడ్డి రాసిన ’నట్స్ అండ్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్’ పుస్తకాన్ని హైదరాబాద్ రవింద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. శాంతిని కాంక్షిస్తూ 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ఈ పుస్తకం రాయడం గొప్ప విషయమని సీఎం కొనియాడారు. నేటికీ వర్గాల మధ్య పోరుతో దేశంలోని కొన్ని ప్రాంతాలు అట్టుడుకిపోతున్నాయని, అలాంటి చోట శాంతి నెలకొనాలని సీఎం కాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందని.. దీనిపై మాట్లాడటానికి ఎవరికీ ధైర్యం లేదని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక భారత భూభాగాన్ని కోల్పోయామని అన్నారు.మణిపూర్ లో అంతర్యుద్ధం జరుగుతోందని.. రెండు దళిత జాతులు ఉచకోతలు కోసుకుంటున్నాయని అన్నారు. ఖనిజ సంపద దోచుకునేందుకే రెండు జాతుల మధ్య చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఈ అంశంపై భారత బలగాలు ఎందుకు జోక్యం చేసుకోవట్లేదని ప్రశ్నించారు. ఈ రెండు అంశాలపై పార్లమెంటులో లోతైన చర్చ జరగాలని అన్నారు.భారత దేశం లో జరుగుతున్న అప్రకటిత యుద్ధంలో కూడా శాంతి నెలకొల్పాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో గత ప్రభుత్వం తెలంగాణలో కొన్ని డిఫెన్స్ సంబంధించిన పరిశ్రమలకు అనుమతి ఇచ్చారని అన్నారు. సోషలిస్టు విదానంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని యాదవరెడ్డి నమ్మారని అన్నారు. పదవులకు అనుగుణంగా వారు ఎప్పుడూ నిర్ణయం తీసుకోలేదని.. తెలంగాణ ఏర్పాటుపై యాదవరెడ్డితో సోనియా చర్చించారని అన్నారు. యాదవరెడ్డి ఏనాడూ ఏ విషయాన్ని చెప్పుకోలేదని అన్నారు. శాంతి తనంతట తాను రాదని.. దానికోసం అందరం కృషి చేయాలని, క్షిపణుల కోసం కాకుండా శాంతి కోసం ఖర్చు చేయాలని యాదవరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రచ్ఛన్న యుద్దాలు కూడా శాంతియుతంగానే జరిగాయని అన్నారు. పార్టీలకు అతీతంగా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, భారాస, భాజపా నేపథ్యాలున్న పలువురు నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మూడో ప్రపంచ యుద్ధం జరుగుతుందేమోననే సంకేతాలు వస్తున్న వేళ శాంతిని కాంక్షిస్తూ ఆ పుస్తకం తేవడం ఆహ్వానించదగ్గ పరిణామమని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి దంపతులను సీఎం సత్కరించారు.

# శ్యామ్ బెనగల్ మృతికి కేసీఆర్ సంతాపం

హైదరాబాద్,ప్రజాభూమి

భారతీయ సినిమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినీమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్ రావు) అని కొనియాడారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సంస్కృతిక వైవిధ్యా న్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింప చేసేవిధంగా దృశ్య మానం చేస్తూ, డాక్యుమెంటరీలు సినిమాల రూపంలో వారందించిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలన చిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనెగల్ తెలంగాణకు గర్వకారణం అని అన్నారు. దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్ నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందు కుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ



అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

# తాడేపల్లిలో స్వచ్ఛాంధ్ర కింద ట్రాక్టర్ల పంపిణీ

- చెత్తను వారసత్వంగా ఇచ్చిన జగన్: మంత్రి నిమ్మల

తాడేపల్లిగూడెం,ప్రజాభూమి

చెత్తపై పన్ను వేసిన చెత్త పాలన జగన్‌ది అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తాడేపల్లిగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 1. 67 లక్షలు విలువగల మినీ ట్రాక్టర్లను పంచాయతీలకు మంత్రి నిమ్మల రామానాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు చెత్తతో సంపద సృష్టించారని చెప్పారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో జగన్ సంపద కేంద్రాలను మూసివేసి రాష్ట్రాన్ని 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చారని అన్నారు. జగన్ అధికారంలోకి రాగానే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో నిల్వ ఉన్న రూ. 2092 కోట్లను దారి మళ్లించారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ రైతు వ్యతిరేక పాలనకు నిరసనగా రైతులకు అండగా అందరం కలసి పోరాడామని తెలిపారు. తాడేపల్లి సీఎస్ఆర్ కళ్యాణమండపంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి నిమ్మల రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను వ్యవసాయ రాష్ట్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి



చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి 72 శాతం పూర్తి చేశామని గుర్తుచేశారు. రైతులకు హెక్టారుకు రూ. 25 వేలకు పెంచి అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని తెలిపారు. రైతులకు అన్నిరకాలుగా అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# అల్లు అర్జున్‌పై కక్షపూరిత ధోరణి

- రేవంత్ సర్కార్ తీరుపై అనుమానాలు
- కిమ్స్‌లో బాలుడు శ్రీతేజకు ఈటెల పరామర్శ

హైదరాబాద్,ప్రజాభూమి

కిమ్స్‌లో చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఈ ఉదయం పరామర్శించారు. ఆయన తండ్రి భాస్కర్‌కు ధైర్యం చెప్పారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. తర్వాత



మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్... జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. సినిమా, రాజకీయ, క్రికెట్ ప్రముఖులు ఎక్కడకు వెళ్లినా మాస్ ఫాలోయింగ్ ఉంటుందని అందుకు తగ్గట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే ప్రభుత్వం మాత్రం అల్లు అర్జున్ విషయంలో కక్ష కట్టిందా అన్నట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేసు నడుస్తున్న టైంలో కావాలని సెలబ్రెటీలను తీసుకొచ్చి స్టేషన్‌లో గంటలు గంటలు కూర్చోబెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. అల్లు అర్జున్ కేసును ఆసరాగా తీసుకొని మొత్తం సినిమా పరిశ్రమనే ప్రభుత్వం టాగ్గెట్ చేసిందా అన్నట్టు అనుమానం కలుగుతోందని ఆరోపించారు. జరిగిన ఘటన బాధాకరమన్న ఈటల రాజేందర్.... భాస్కర్ కుటుంబాన్ని ఆదుకోవడం, శ్రీతేజ్ వైద్య ఖర్చులు పూర్తిగా చెల్లించే బాధ్యతను అల్లు అర్జున్ తీసుకోవాలని సూచించారు. ఇకపై సెలబ్రెటీలు టూర్‌లు ఉండేటప్పుడు దానికి తగ్గట్టుగానే భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

# సైబరాబాద్‌లో ల్యాండ్ కేసులు ఎక్కువ

- తమ పరిధి మేరకు సమస్యలు పరిష్కరించాం
- సైబర్ క్రైమ్‌పై ఎక్కువ దృష్టి సారించాం
- వార్షిక నివేదికను వెల్లడించిన సైబరాబాద్ సిపి మహంతి

హైదరాబాద్,ప్రజాభూమి

సైబరాబాద్‌లో ల్యాండ్ కేసులు ఎక్కువగా ఉంటాయని.. తమ లిమిట్‌ను బట్టి పరిష్కరించామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. ఈ సంవత్సరం సైబర్ క్రైమ్, ఎకనామిక్ అఫెన్స్ వింగ్ పై ఎక్కువ దృష్టి పెట్టామని తెలిపారు. వచ్చే సంవత్సరం నుంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపైన కేసు నమోదు చేస్తామని సీపీ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నేరాలపై వార్షిక నివేదిక- 2024ను సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. మంగళవారం మీడియాతో సీపీ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం మొత్తం 37 వేల 600 కేసులు నమోదు చేశామని తెలిపారు. సైబర్ క్రైమ్ 32 శాతం పెరిగిందన్నారు. సైబర్ క్రైమ్‌లో 11914 కేసులకు గాను రూ.70 కోట్ల అమౌంట్ రికవరీ అయ్యిందన్నారు. డిజిటల్ క్రైమ్ కూడా బాగా పెరిగిందన్నారు. 8 వేల మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని తెలిపారు. అలాగే నార్కోటిక్ కేసులు కూడా పెరిగాయన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ 421 కేసుల్లో 24 కోట్ల 92 లక్షల విలువ చేసే మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఎన్‌డీపీఎస్ కేసుల్లో 954 మందిని అరెస్ట్ చేశామన్నారు. 805 రోడ్డు ప్రమాదాలలో 842 మంది మృతి చెందారని తెలిపారు. చలాన్స్‌లో సైబరాబాద్ కమిషనరేట్ రికార్డ్ కొట్టింది. చలాన్స్ ద్వారా 111 కోట్ల 81లక్షల 71వేల 245 రూపాయలు వసూలు చేసినట్లు సీపీ వెల్లడించారు. ఎకనామిక్ కు సంబంధించి 90 కేసులలో 5 కోట్ల, 29 లక్షల ప్రాపర్టీ అటాచ్ చేశామని తెలిపారు. 541 షీ టీం




కేసులు నమోదు అయ్యాయన్నారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి జనవరి నుంచి లక్ష యాభై వేల వరకు లోకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వొచ్చన్నారు. లక్షా యాభై దాటితేనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. బీఎన్ఎస్ యాక్ట్ ఫస్ట్ ఎఫ్ఐఆర్ రాజేంద్రనగర్‌లో నమోదు అయ్యిందన్నారు. బీఎన్ఎస్ యాక్ట్ వచ్చాక మొత్తం 14 వేల 250 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక దృష్టి పెట్టామని, కొన్ని బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్నామన్నారు. ఈవెంట్స్ పర్మిషన్ కోసం పర్మిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ తీసుకొచ్చామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు.

## హిమాచల్‌లో భారీగా కురుస్తున్న మంచు



న్యూఢిల్లీ,ప్రజాభూమి

ప్రముఖ కొండ ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా మంచు కురుస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఇళ్లు, రహదారులు, వాహనాలు, చెట్లపై భారీగా హిమపాతం పడుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మనాలీ, రాజధాని సిమ్లా సహా తదితర ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం పేరుకుపోయింది. దీంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మంచు పరిస్థితుల దృష్ట్యా అధికారులు పలు రహదారులను మూసివేశారు. మూడు జాతీయ రహదారులు సహా 174 రోడ్లను మూసివేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు.

## వీసా లేకున్నా మలేషియా టూర్

న్యూఢిల్లీ,ప్రజాభూమి

భారతీయులు మరో రెండేళ్ల వరకూ వీసా లేకున్నా మలేషియాకు వెళ్లవచ్చు. 2026 డిసెంబర్ 31 వరకూ వీసా లేకుండా తమ దేశంలో 30 రోజులు పర్యటించవచ్చని అక్కడి ప్రభుత్వం తెలిపింది. 2025 ఏషియన్ చాంపియన్ షిప్ చైర్మన్ షిప్ మలేషియాకు రానున్నది. ఈ నేపథ్యంలో మలేషియాలో పర్యటనకు ఏర్పాట్లు చేసుకోవచ్చునని మలేషియా హోంశాఖ సెక్రటరీ జనరల్ దాటుక్ అవాంగ్ అల్లిక్ జెమాన్ తెలిపారు. పర్యాటక రంగం విస్తరణ, ఆర్థిక వఅద్ధి ఉద్దీపనకు తొలుత 2023 లో మలేషియా వీసా మినహాయింపు పక్రియ ప్రారంభించింది. చైనా పౌరులకు కూడా వీసా మినహాయింపునిచ్చింది మలేషియా పర్యాటక రంగానికి భారత ప్రయానికులు చాలా కీలకం.

## ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సవాలక్ష కొర్రీలు

- మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్,ప్రజాభూమి

ధాన్యం కొనుగోళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ సవాలక్ష కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. విషయంలో కొన్నది కాకరకాయ.. కొసిరింది గుమ్మడికాయ అన్నట్లు కాంగ్రెస్ సర్కార్ తీరు ఉన్నదని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయితే ప్రభుత్వం కొన్నది 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని విమర్శించారు. రైతుభరోసా కింద ఎకరాకు ఏడాదికి రూ.15 వేల కోట్లకుగాను గత వానాకాలం, యాసంగి కలిపి ఎగ్గొట్టింది రూ.26 వేల కోట్లని చెప్పారు. క్వింటాలుకు రూ.500 బోనస్ అని రైతులలో ఆశలు రేపి దొడ్డు వడ్లకు.. తెడ్డు చూపి, సన్న వడ్లకు సవాలక్ష కొర్రీలు పెట్టి విదిలించింది కేవలం రూ.530 కోట్లని మండిపడ్డారు. అసలు రైతుకే భరోసా లేదని, ఇక కౌలు రైతులు, రైతుకూలీల ఊసెక్కడిదని ధ్వజమెత్తారు. కల్లాల వద్దకే కొనుగోళ్లతో కేసీఆర్ ప్రభుత్వంలో రైతుకు భరోసా కల్పించామన్నారు. కల్లోల కాంగ్రెస్ పాలనలో ధాన్యం కొనుగోళ్లు లేక రైతన్నలు నిత్యం ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. జాగో తెలంగాణ జాగో అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ధరలపై ప్రభుత్వం కుంభకర్ణ నిద్ర

- ఎక్స్ వేదికగా మండిపడ్డ రాహుల్



న్యూఢిల్లీ,ప్రజాభూమి

ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్ర పోతోందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'కొన్ని రోజుల క్రితం స్థానిక కూరగాయల మార్కెట్‌కు వెళ్లాను. అక్కడ సామాన్యులను కలిసి మాట్లాడాను. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు వారు రాజీ పడాల్సి వస్తుంది. గతంలో రూ.40 ఉండే కిలో వెల్లుల్లి ధర ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. ఇలా ధరలు పెరిగిపోతుంటే.. ప్రజలు ఇంక పొదుపు ఏం చేయగలుగుతారు. ద్రవ్యోల్బణం పెరగడంతో సామాన్యుడి వంట గది బ్జడెట్ వారి చేయి దాటిపోతోంది. కేంద్రప్రభుత్వం ధరలను నియంత్రించకుండా.. కుంభకర్ణుడిలా నిద్రపోతోంది' అని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇటీవల గిరినగర్‌లోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ సామాన్యులతో ధరల పెరుగుదలపై చర్చించారు. అంతేకాకుండా దానివల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ధరలు పెరగడంతో ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి వస్తుందని ఈసదర్భంగా కొందరు మహిళలు రాహుల్‌కు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

# ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,ప్రజాభూమి

ఈవీఎంల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా గొల్లపూడి మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచే గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. వీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ టీవీ కెమెరాల వ్యవస్థను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీలో డిఆర్వో ఎం. లక్ష్మి నరసింహం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు

- అమిత్ షా వ్యాఖ్యాలే ఇందుకు నిదర్శనం
- సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ విమర్శలు



విజయవాడ,ప్రజాభూమి

రాజ్యాంగంపై బీజేపీకి అభిమానం లేదని ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. పార్లమెంట్‌లో డా బీఆర్ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా అవమానపరిచాడని, ఆయనను ప్రధాని మోడీ వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. అమిత్ షాని మంత్రి పదవి నుండి తొలగించాలని డిసెంబర్ 30వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తాం అని తెలిపారు. ఆదాని అగ్రిమెంట్‌పై అవకతవకలు జరిగాయని రాయటర్స్ పత్రిక రాసిందని, సీఎం చంద్రబాబు కూడా ఆదాని అంశంపై స్పందించడం లేదన్నారు. ఆదాని అంశంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదు? అని రామకృష్ణ ప్రశ్నించారు.విజయవాడ దాసరి భవన్‌లో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలకు సంబందించిన పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్, ఇతర నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ 'డిసెంబర్ 26 నుండి శత వార్షికోత్సవాలు ప్రారంభం అవుతాయి. సీపీఐ శత వార్షికోత్సవ సభ ఖమ్మంలో 2026 డిసెంబర్ 26న జరుగుతుంది. దేశంలో కాంగ్రెస్, సీపీఐ మాత్రమే 100 సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీలు. సంవత్సరం పొడవునా శత వార్షికోత్సవ సభలు జరుగుతాయి. 26న విజయవాడలో శత వార్షికోత్సవ సభలు జరుగుతాయని చెప్పారు. 'పార్లమెంట్‌లో డా బీఆర్ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా అవమానపరిచారు. ప్రధాని అమిత్ షాని వెనకేసుకొస్తున్నారు. రాజ్యాంగంపై బీజేపీకి అభిమానం లేదు. రాజ్యాంగ పీఠిక మార్చాలని బీజేపీ ఎంపీ సుప్రీంకోర్టులో కేసు వేశారు. అమిత్ షాని మంత్రి పదవి నుండి తొలగించాలని 30వ తేదీన దేశ వ్యాప్తంగా ఆందోళన జరుగుతుంది. ఆదాని అగ్రిమెంట్‌పై అవకతవకలు జరిగాయని రాయటర్స్ పత్రిక రాసింది. సీఎం చంద్రబాబు కూడా ఆదాని అంశంపై స్పందించడం లేదు, ఆయన బయపడుతున్నారు. ఆదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి. చిన్న చిన్న అంశాలపై స్పందిస్తున్న సీఎం ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదు. ఆదాని అంశంపై పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదు?. చంద్రబాబు నిద్రా పోతున్నారా? లేక నిద్ర పోయినట్లు నటిస్తున్నారా?. ఆదాని అంశంపై చర్యలు తీసుకొనే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని రామకృష్ణ తెలిపారు.

# ఇంజిన్ రూమ్‌లో పేలుడు ఘటన

- మధ్యధరా సముద్రంలో రష్యా నౌక మునక



మాస్కో,ప్రజాభూమి

రష్యాకు చెందిన ఓ కార్గో నౌక మధ్యధరా సముద్రంలో మునిగిపోయింది. ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. నౌకలో ఉన్న 16 మంది సిబ్బందిలో 14 మందిని రక్షించామని, ఇద్దరు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఈ ఘటన చర్చనీయాంశమైంది. ఈ కార్గోషిప్ డిసెంబర్ 11న రష్యాలోని సెయింట్ పీటర్‌బర్గ్ నుంచి బయల్దేరింది. సోమవారం చివరిగా దానినుంచి సిగ్నల్ అందింది. వ్లాదివొస్తోక్ పోర్ట్‌లో అమర్చడం కోసం అందులో కొన్ని పరికరాలను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ కంటైనర్లను ఖాళీ చేసుకుని నౌకను సిరియా పంపాలని రష్యా భావించినట్లు కొన్ని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తిరుగుబాటుదారుల నియంత్రణలో ఉన్న సిరియాలో ప్రస్తుతం కల్లోల పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ దేశంలో ఉన్న తమ ఆయుధ సామగ్రిని స్వదేశానికి తీసుకొచ్చుకునేందుకు మాస్కో ఈ నౌకను పంపించాలని భావించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈలోగా ప్రమాదం జరిగి నౌక మునిగిపోవడం గమనార్హం.

# థియేటర్ ఘటనలో రాజకీయాలు మానాలి

- అల్లు అర్జున్‌కు వేధింపుల వెనక మరో మతలబు
- సిఎం రేవంత్ రెడ్డి తీరుపై మండిపడ్డ ఎంపి డికె అరుణ



హైదరాబాద్, ప్రజాభూమి

సంధ్య థియేటర్ తొక్కిసలాట దుర్ఘటన అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సినీ పరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని భాజపా ఎంపీ డీకే అరుణ అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభిమానులుగా వెళ్లిన కుటుంబంలో తల్లి రేవతి చనిపోవడం, కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం బాధాకరమన్నారు. సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా ముగింపు పలకాలని కోరారు. ఇకపోతే అల్లు అర్జున్, ఆయన కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేధించడం వెనుక అసలు మతలబు వేరే ఉందని.. అది త్వరలో తేలుతుందంటూ ఎంపీ డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి కక్ష సాధింపు దోరణిని తాను ఎప్పుడు చూడలేదన్నారు. అసెంబ్లీలో అసలు సమస్యలు లేవన్నట్లు ఎంఐఎం వాళ్ళతో అడిగించుకుని మరీ సీఎం సభలో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఢిల్లీకి సూట్ కేసులు పంపించే అంశంలో ఎక్కడో చెడిందని.. అందుకే అల్లు అర్జున్‌ను టార్గె÷ట్ చేసినట్లు ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దానికి కచ్చితమైన కారణం ఉంటుందన్నారు. మంత్రి సీతక్క తెలుసుకోవాల్సిన అంశం ఏంటంటే పోలీసులను హీరోలుగా చూపిస్తూ చాలా సినిమాలు వచ్చాయన్నారు. ఏడాదిలో ఇచ్చిన హామీలపై జనం ఎక్కడ అడుగుతారో అని రేవంత్ రెడ్డి కొత్త డ్రామాకు తెరలేపి డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అల్లు అర్జున్ ఇంటి మీద దాడిని కూడా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన ఇంటి మీద దాడి చేసిన వాళ్ళల్లో రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం వాళ్ళే ఉన్నారని తెలిపారు. అంటే దీని వెనక ఇంకా ఏదో బలమైన కారణం ఉందని సందేహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలి కానీ ఇలా చిల్లర పాలిటిక్స్ చేయద్దు అంటూ ఎంపీ డీకే అరుణ హితవు పలికారు

# బెలగావి వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాలు

- డిసెంబర్ 26, 27 తేదీల్లో నిర్వహణ
- నవ్ సత్యాగ్రహ బైఠక్ అని నామకరణం
- మహాత్ముడు తొలిసారి బెలగావి నుంచే బాధ్యతలు
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ వెల్లడి



న్యూఢిల్లీ,ప్రజాభూమి

జాతిపిత మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వేదికపై ఈ సారి సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో కర్ణాటకలోని బెలగావి వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలు బెలగావిలో జరగనున్నాయని తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో కేసీ వేణుగోపాల్ విలేకర్లతో మాట్లాడుతూ.. సమావేశాలను నవ్ సత్యాగ్రహ బైఠక్ అని పిలుస్తున్నామని పేర్కొన్నారు. ఇక డిసెంబర్ 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ పేరిట ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ ర్యాలీకి ఏఐసీసీ సభ్యులతోపాటు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని ఆయన వివరించారు. ఇక 27వ తేదిన మధ్యాహ్నం 2.30 గంటలకు మహాత్మాగాంధీ నగర్‌లో ఈ సీడబ్ల్యుసీ సమావేశానికి 200 మంది శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నేతలతోపాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులు సైతం హాజరుకానున్నారని తెలిపారు. 1924, డిసెంబర్ 26వ తేదీన మహాత్మా గాంధీ నేతృత్వంలో కర్ణాటకలోని బెలగావిలో సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వంద ఏళ్ళ అనంతరం అదే స్ఫూర్తితో ఈ సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఇటీవల పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖలతోపాటు దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై చర్చించనున్నారు. అలాగా ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకొంది. దీంతో భవిష్యత్తులో పార్టీ అనుసరించవలసిన వ్యూహంపై చర్చించనున్నారు. అధికార ఎన్డీయేను ఎలా ఎదుర్కోవాలి... రానున్న ఢిల్లీ అసెంబ్లీలో ఒంటరిగా బరిలో దిగుతోన్న వేళ.. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై ఈ సందర్భంగా పార్టీ నేతలు చర్చించనున్నారని తెలుస్తోంది. కేంద్ర హోం శాఖ మంత్రి రాజీనామా చేయ్యాలని.. అలాగే ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. అలాంటి వేళ.. పార్లమెంట్‌లో రెండు రోజుల పాటు దీనిపై చర్చను ఏర్పాటు చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశాయి. ఆ క్రమంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల దాడితోపాటు నిరసనలు సైతం చేపట్టారు.

# బైపాస్ రోడ్డు నిర్మాణంలో అలసత్వం

- గత ప్రభుత్వ విధానాలపై పెమ్మసాని ఆగ్రహం



అమరావతి,ప్రజాభూమి

గత సిఎం జగన్మోహన్ రెడ్డి అపరిపక్వ విధానాలు, అమరావతి పై కక్ష పూరిత వైఖరి, అవగాహన లేమి, దూరదృష్టి లేకపోవడం వల్ల విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో మరింత జాప్యం జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పనుల పురోగతిని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తో కలిసి మంగళవారం రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెం వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. విజయవాడ బైపాస్ పనులకు సంబంధించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం ప్రతి రెండు కిలోమీటర్ల కి అండర్ పాస్ మార్గాలు వేయాల్సి ఉండగా, రాజధాని అమరావతి మహా నగర నిర్మాణం జరుగుతున్నందున ప్రజా రవాణా సౌకర్యార్థం ప్రతి కిలోమీటర్ కు ఒక అండర్ పాస్ ఉండేలా 2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం నేషనల్ హైవే నుంచి అనుమతులు పొందింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుమతులను తుంగలో తొక్కి, పాత నిబంధనల మేరకే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించమని అధికారులకు ఆదేశించింది. రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతున్నందున భవిష్యత్ లో జనాభా పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి కిలోమీటర్ కు ఒక అండర్ పాస్ ఉండేలా నేషనల్ హైవే అధికారులను ఒప్పించారని, జగన్ మోహన్ రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరించారని మంత్రి అన్నారు. రోడ్డు నిర్మాణం ఏప్రిల్ కి పూర్తి కావాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల మరో ఏడాదిన్నర వరకు ఈ నిర్మాణాలు ఆలస్యం కావడంతో పాటు అనుకున్న విధంగా రోడ్డు నిర్మాణం జరిగేందుకు అదనంగా రూ . 450 కోట్లు వ్యయం చేయాల్చి వస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఇలా ఆలస్యం, ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండాలనే ఉద్దేశంతో రహదారి నిర్మాణాన్ని పరిశీలించడం జరిగింది. రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఇంకా ఇవ్వవలసిన పరిహారంతో పాటు చిన్న చిన్న సమస్యలను అధికారులు, ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఎన్ హెచ్ పి డి పార్వతీశం, అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సి ఈ ప్రభాకర్, నవయుగ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ రమేష్, మేనేజర్ రామకృష్ణ, ఆదాని సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీరామ్ మూర్తి, ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ కన్సల్టింగ్ టీం లీడర్ బసవేశ్వర రావు, రైతులు బెల్లంకొండ నరసింహారావు, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్ పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టి 100 మీటర్లు ఈడ్చికెళ్లిన ట్రక్

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

లక్నో,ప్రజాభూమి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అతివేగంగా వెళ్తున్న ట్రక్కు ముందు వెళు_న్న బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. అనంతరం 100 మీటర్ల వరకూ అలాగే ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఆగ్రాలోని వాటర్ వర్క్స్ రోడ్డులో ఆదివారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా.. వెనుకనుంచి అతివేగంగా వస్తున్న ఓ ట్రక్కు వెనుక నుంచి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో ట్రక్కు ముందు భాగంలో బైక్‌తోపాటు ఆ ఇద్దరు యువకులు చిక్కుకుపోయారు. ఓ యువకుడి తల ట్రక్ ముందు టైరుకు అడుగు దూరంలో ఉంది. ఆ ఇద్దరు యువకులు ప్రాణ భయంతో కాపాడండి అంటూ కేకలు వేస్తున్నా ట్రక్కు డ్రైవర్ అవేవీ పట్టించుకోకుండా వేగంగా వెళ్లసాగాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు ఈ తతంగాన్నంతా గమనించి ట్రక్కును ఓవర్‌టెక్ చేసి ఆపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆ ఇద్దరు యువకులను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు వచ్చే సరికి ఆ ట్రక్కు డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# వందేభారత్‌లో స్లీపర్ కోచ్ రన్ విజయవంతం

**న్యూఢిల్లీ,ప్రజాభూమి**

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని కజురహో-ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చైన్నై ఐసీఎఫ్ నుంచి కజురహో చేరిన వందేభారత్ స్లీపర్ రైలు.. శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరుకున్నది. మరుసటి రోజు కజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది. ఎస్‌ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే టెక్నికల్ టీమ్‌తోపాటు, ఐసీఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కజురహోకు వెళ్తున్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు.. తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది. ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. కాగా ఈ రైలు వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ రైల్వే భావిస్తున్నది. దీనికోసం పది రైళ్లను సిద్ధం చేస్తున్నది. వందే భారత్ స్లీపర్ రైలుకు చాలానే ప్రత్యేకలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులు ఈ రైలులో సౌకర్యాలుంటాయి. ఈ రైలు ముందు విలాసవంతమైన హోటల్స్ సైతం దిగదుడుపేనని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్నది. వందే భారత్ స్లీపర్ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణికులు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో..ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దాంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనున్నది. రైలులో ఫైర్ సేఫ్టీతో పాటు ప్రతి బెర్త్ వద్ద అత్యవసర స్టాప్ బటన్స్ సైతం ఉంటాయి. ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు బెర్తులను మెరుగైన కుషన్‌తో ఏర్పాటు చేశారు. అప్పర్ బెర్తులు ఎక్కేలా మెట్లు ఏర్పాటు చేశారు. దాంతో ప్రయాణికులకు సరికొత్త అనుభవాన్ని అందించనున్నాయి. అలాగే, రైలులో అత్యాధునిక సేవలు అందించనున్నారు. బయో వాక్యూమ్ టాయిలెట్లు, టచ్ ఫ్రీ ఫిట్టింగ్‌లు, షవర్ క్యూబికల్స్, ఆటోమేటిక్ డోర్లు, జీపీఎస్ ఆధారిత డిస్‌ప్లేలు, ఛార్జింగ్ సాకెట్లు వంటి సౌకర్యాలు ఈ మరింత ఆకర్షణీయంగా ఏర్పాటు



చేస్తున్నది. రైలులో ఆటోమేటెడ్ డోర్లు ఏర్పాటు చేశారు. టాయిలెట్‌లో ఎలాంటి బయటన్ నొక్కకుండానే నీళ్లు వస్తాయి. ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి వెళ్లేందుకు ఆటో మేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కోచ్‌లో ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ సైతం ఉంటుంది. ప్రతి కోచ్‌లో సీసీ కెమెరాలు..ప్రతి కోచ్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. చార్జింగ్ పెట్టుకునేందుకు ప్రతి బెర్త్ వద్ద సాకెట్ ఉంటుంది. అలాగే, బెర్త్ వద్ద చిన్న లైట్ సైతం ఉంటుంది. దాంతో ఎవరైనా బుక్‌లు, పేపర్ చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. సేఫ్టీ 'కవచ్' సిస్టమ్, బ్లాట్ ప్రూఫ్ బ్యాటరీ, 3 గంటల ఎమర్జెన్సీ బ్యాకప్ ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తాయని రైల్వేశాఖ పేర్కొంది. అయితే, వందే భారత్ తొలి రైలు ట్రయల్ రన్ మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో జరుగనున్నది తెలుస్తున్నది. రైల్వే డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ట్రయల్ జరుగనున్నది. రైలు స్థిరత్వం, వైబ్రేషన్, డైనమిక్ పనితీరును ట్రయల్స్‌లో అంచనా వేయనున్నారు.

# పేర్ని నాని పిటిషన్‌పై హైకోర్టు అభ్యంతరం

**అమరావతి, ప్రజాభూమి**

గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నాని , ఆయన కుమారుడు కిట్టు వేసిన పిటిషన్లపై ఏపీ హైకోర్ట్‌లో మంగళవారం విచారణ జరిగింది. విచారణకు హాజరుకావాలంటూ మచిలీపట్నం పోలీసులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పేర్నినాని, ఆయన కుమారుడు పేర్ని కృష్ణమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారించింది. అయితే ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారని న్యాయమూర్తి గుర్తుచేశారు. గడువు ముగిసిన నేపథ్యంలో పిటిషన్ విచారణపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని, తిరిగి పోలీసులు నోటీసులు ఇస్తే కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని న్యాయస్థానాన్ని న్యాయవాదులు అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి అంగీకారం తెలిపారు. మచిలీపట్నంలో వైసీపీ నేత పేర్నినాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాలశాఖకు లీజుకిచ్చారు. అయితే ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయం అయ్యాయని పేర్కొంటూ చింతం కోటిరెడ్డి అనే అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని సతీమణి జయసుధ బెయిల్ పిటీషన్ మరోసారి వాయిదా పడింది. పీపీ సెలవులో ఉండటంతో మరోసారి బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. ఈరోజు ప్రాసిక్యూషన్ తరపున కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ సెలవు పెట్టారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరుకాకపోవటంతో పిటిషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. అలాగే కౌంటర్ దాఖలు విషయంలో పోలీసుల తీరుపై కూడా జడ్జి అసహనం వ్యక్తం చేశారు. పేర్నినాని సతీమణి జయసుధ బెయిల్ పిటిషన్‌పై వాయిదా పడటం ఇది నాలుగోసారి. కాగా.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని సతీమణి జయసుధ పేరిట ఉన్న గోదాముల్లో రేషన్ బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో సుమారు 187 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు




బయటకు వచ్చినప్పటి నుంచి పేర్నినాని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. గత పది రోజులుగా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతంలో ఉన్నారు. కొద్దిరోజుల క్రితం పేర్నినాని బయటకు వచ్చి హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్ వేశారు. బెయిల్‌పై క్లారిటీ వచ్చే వరకు పేర్నినాని సతీమణిని బయటకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోవైపు పేర్నినాని భార్యపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అలాగే ఇటీవల పేర్నినాని కుటుంబానికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. విచారణకు సహకరించాల్సిందిగా పేర్నినాని ఇంటికి వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే పేర్నినాని ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి గోడకు నోటీసులను అంటించారు. నోటీసులను పేర్నినాని చూడకపోవడంతో మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు చెబుతున్నారు.

# సెకనుకు రెండు బిర్యానీలు...

## - 97 లక్షలకు పైగా ఆర్డర్ చేసిన హైదరాబాదీలు

**న్యూఢిల్లీ,ప్రజాభూమి**

అది పార్టీ అయినా.. సందర్భం ఏదైనా అందరికీ మొదట గుర్తుకు వచ్చేది బిర్యానియే. ఈ వంటకం భారతీయులకు ఇష్టమైన ఎంపికగా నిలిచింది. ఈ క్రమంలో ఆన్‌లైఫుడ్ ఫుడ్ డెలివరీ రంగంలోనే బిర్యానీనే టాప్ ప్లేస్‌లో నిలుస్తూ వస్తున్నది. తాజాగా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది స్విగ్గి. వరుసగా తొమ్మిదో సంవత్సరం ఆన్‌లైన్ ఆర్డర్లలో బిర్యానీ అగ్రస్థానంలో నిలిచి.. భారతీయులకు ప్రియమైన వంటకంగా నిలిచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 22 వరకు 8.3 కోట్ల బిర్యానీలు ఆర్డర్ చేయగా.. ప్రతి నిమిషానికి 158 బిర్యానీలు, సెకనుకు రెండు బిర్యానీలు ఆర్డర్ చేశారు. దీని తర్వాత, దోస 2.3 కోట్ల ఆర్డర్‌లతో రెండవ స్థానంలో నిలిచింది. స్విగ్గి 'ఫుడ్ ట్రెండ్ రిపోర్ట్' ప్రకారం.. బిర్యానీ వరుసగా తొమ్మిదవ సంవత్సరం అత్యధికంగా ఆర్డర్లు సాధించింది. 4.9లక్షల చికెన్ బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్లుగా పేర్కొంది. ఇందులో హైదరాబాదీలు అత్యధికంగా చికెన్ బిర్యానీని 97 లక్షలకుపైగా ఆర్డర్ చేశారు. ఆ తర్వాత 77 లక్షల ఆర్డర్లతో బెంగళూరు రెండో స్థానంలో, 46 లక్షల ఆర్డర్లతో చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. రాత్రి సమయంలో ఎక్కువగా తిన్న ఫుడ్‌లలో చికెన్ బర్గర్ నిలిచింది. రాత్రి 12 నుంచి 2 గంటల మధ్య 18.4లక్షల చికెన్ బర్గర్ ఆర్డర్లు వచ్చాయని స్విగ్గీ రిపోర్ట్ పేర్కొంది. ఇక మసాలా దోసలో బెంగళూరు ఆదిపత్యాన్ని కొనసాగించింది. బెంగళూరు వాసులు జనవరి ఒకటి నుంచి నవంబర్ 22 మధ్య 25లక్షల దోసెలను ఆర్డర్ చేశారు. ఢిల్లీ, చండీగడ్, కోల్‌కతాలో చోలే, ఆలూ పరాఠా, కచోరీలకు ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. ఇక బెంగళూరుకు చెందిన ఓ స్విగ్గీ యూజర్ ఏకంగా ఏడాదిలో పాస్తా కోసం రూ.49,900 వెచ్చించాడు. దాదాపు 55 ఫెటుక్సిన్ ఆల్ఫ్రెడో, 40 మాక్, చీజ్.. 30 స్పఘెట్టి కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ఏడాది లంచ్ కోసం కంటే డిన్నర్‌కి 29శాతం ఎక్కువగా 21.5 కోట్లు ఆర్డర్లు వచ్చాయి. 24.8 లక్షల ఆర్డర్‌లతో చికెన్ రోల్ అత్యంత ఇష్టపడే



స్నాక్‌గా నిలిచింది. 16.3 లక్షల ఆర్డర్లతో చికెన్ మోమోస్ రెండో స్థానంలో, 13 లక్షల ఆర్డర్లతో పొటాటో ఫ్రైస్ మూడో స్థానంలో నిలిచాయి. నివేదిక ప్రకారం, డెలివరీ బాయ్స్ మొత్తం 1.96 బిలియన్ కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ లెక్కన కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు 5.33లక్షల సార్లు ప్రయాణించడంతో సమానమని పేర్కొన్నారు. ముంబయికి చెందిన కపిల్ కుమార్ పాండే అత్యధికంగా 10,703 ఆర్డర్‌లను డెలివరీ చేశారు. కోయంబత్తూరుకు చెందిన కాళీశ్వరి ఎం మహిళ 6,658 ఆర్డర్‌లను డెలివరీ చేసి అగ్రస్థానంలో నిలిచినట్లు నివేదిక పేర్కొంది.

# నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

## - కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు

**విశాఖపట్టణం,ప్రజాభూమి**

పశ్చిమ మధ్య, దానిని ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు తీరాల వెంబడి ఈ అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటలలో నైరుతి బంగాళాఖాతం, దానిని నానుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురవనున్నాయి. నేడు అల్లూరి అనకాపల్లి, కాకినాడ, పశ్చిమ



గోదావరి, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురవనున్నాయని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలిపారు. బుధవారం తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని జగన్నాథ్ కుమార్ తెలిపారు.

కోస్తా తీరం వెంబడి గంటకి 35 నుంచి 45 కిలోమీటర్లు, గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. కోస్తా ఆంధ్ర తీరంలో ఉన్న అన్ని పోర్టులలో మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నేడు, రేపు కోస్తా తీరంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూ డదని విశాఖ వాతావరణ శాఖ హెచ్చరించింది.

దాదాపు 5-6 రోజులుగా మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదు. మరో 3-4 రోజులు కూడా పడవలు ఒడ్డుకే పరిమితం కనున్నాయి. ఇక భారీ వర్షాలు కురిసే జిల్లాలలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# వైసీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



**అమరావతి,ప్రజాభూమి**

రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుపై వైఎస్సార్సీపీ పోరుబాట పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు పార్టీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. 44 సంవత్సరాల అనుభవాన్ని ప్రజలను మోసం చేయడానికి ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా 27వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. "మేము ఎన్డీఏ పక్షం కాదు, ఇండియా పక్షం కాదు. మేము మొదటి నుంచి న్యూట్రల్‌గానే ఉన్నాం. రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. మేము మొదటి నుంచి చెప్తున్నం జెమిలి ఎన్నికలు వస్తాయని. జేపీసీలో నేను కూడా ఒక సభ్యుడిని. జేపీసీ ప్రతి రాష్ట్రంలోని పర్యటిస్తుంది. ప్రతి రాజకీయ పార్టీని కలుస్తుంది. జేపీసీకి పార్టీ వైఖరిని వైఎస్ జగన్ స్పష్టం చేస్తారు" అని విజయసాయిరెడ్డి వెల్లడించారు.పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు రూపాయి కూడా పెంచమని హామీ ఇచ్చారని.. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 15 వేల కోట్లకు పైగా భారాన్ని మోపారన్నారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి రూపాయిన్నర వరకు యూనిట్‌పై భారం పడుతుందన్నారు. ఆరు నెలల కాలంలో 75 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని.. సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. నాణ్యమైన విద్యుత్తు, విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి నాణ్యమైన మద్యాన్ని అందజేస్తున్నారంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేశారు.

# విజయవాడ కోర్టుకు తెలంగాణ,ఏపీ ప్రజాప్రతినిధులు




**అమరావతి,ప్రజాభూమి**

తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు మంగళవారం విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. 2007లో ఓబులాపురం మైనింగ్ పరిశీలనకు వెళ్లిన 21 మంది నేతలపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం కోర్టుకు నేతలు ఈరోజు హాజరయ్యారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు అవగా.. వీరిలో ముగ్గురు మరణించారు. మిగిలిన వారిని తప్పనిసరిగా కోర్టుకు హాజరు కావాలంటూ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి, దేవినేని ఉమా, నిమ్మకాయల చినరాజప్ప, ఎర్రబెల్లి దయాకర్, అమర్నాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు బాబు రాజేంద్రప్రసాద్, కోళ్ల లలిత కుమారి, పొలం నాగరాజు, చిన్నబాబు రమేష్, గురుమూర్తి కోర్టుకు హాజరయ్యారు. మరోవైపు విజయవాడ కోర్టు ఆవరణలో ఆంధ్ర తెలంగాణ నేతల కలయికతో సందడి నెలకొంది. ఒకప్పుడు అంతా తెలుగుదేశంలో ఉండి వేరే పార్టీలు మారిన తెలంగాణ నేతలు.. పాత మిత్రులతో ఆత్మీయ సంభాషణ జరిపారు.

# నా భార్యను శిక్షించండి...

## - నా కుమారుడిని రక్షించండి
## - సెల్ఫీ వీడియో తీసుకొని వ్యక్తి ఆత్మహత్య

**అమరావతి, ప్రజాభూమి**

జిల్లాలో ఓ వ్యక్తి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. పెనుమూరు మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన మోహనా చారి (45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు మోహనాచారి తీసిని సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. తన ఆత్మహత్యకు కారణాలు అందులో వివరించాడు. తన భార్యను ట్రాప్ చేశారని.. ఆమెను కూడా శిక్షించాలి అంటూ వీడియోలో బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం మోహనాచారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మోహనాచారికి భార్య, కుమారుడు ఉన్నాడు. అయితే తన భార్యను సచివాలయంకు చెందిన ఓ ఉద్యోగి ట్రాప్ చేశాడంటూ మోహనాచారి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు గుంటీపల్లి సచివాలయంకు చెందిన ఉద్యోగి కారణం అంటూ బాధితుడు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. "నా భార్యను సచివాలయ ఉద్యోగి ట్రాప్ చేసి నాకు దూరం చేశాడు.

వారిద్దరిని శిక్షించాలి అంటూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వినతి చేస్తూ" పలువురికి మోహనాచారి వీడియో కాల్ చేసి ఆపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. "ఆ ఉద్యోగితో పాటు నా భార్యను శిక్షించండి. నా 8 ఏళ్ల కుమారున్ని కాపాడండి" అంటూ వీడియో కాల్ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశాడు బాధితుడు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న క్వారీలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. క్వారీలో దూకడంతో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మోహనా చారి మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు సెల్ఫీ సూసైడ్‌పై కేసు నమోదు చేశారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### బాలుడి అనుమానాస్పద మృతి

మరోవైపు విశాఖలో పదమూడేళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అరుష్ అమన్ (13) అనే బాలుడు బాత్రూంలో షూ లేస్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడి తల్లిదండ్రులు జార్ఖండ్‌లో ఉంటున్నారు.

అయితే భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో అమన్ విశాఖలో తాత నివాసంలో ఉంటున్నాడు. ఈక్రమంలోనే బాలుడు ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. అయితే బాలుడు ఎక్కువగా మొబైల్‌లో వీడియో గేమ్స్ ఆడుతుంటాడని తాతా వినోద్ కుమార్ షా.. పోలీసులకు తెలిపాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# నేడు మధ్యప్రదేశ్‌లో మోడీ పర్యటన

- కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన
- ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడి



భోపాల్, ప్రజాభూమి

ప్రధాని మోడీ బుధవారం మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మంగళవారం తెలిపారు. డిసెంబర్ 25న కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మధ్యప్రదేశ్‌లోని 10 జిల్లాల్లోని దాదాపు 44 లక్షల మందికి, ఉత్తరప్రదేశ్‌లోని 21 లక్షల మందికి తాగునీరు అందనుంది. దీనికి రూ. 44,605 కోట్లు ఖర్చవుతుందని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. నదుల అనుసంధానానికి మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి కలను సాకారం చేసేందుకు ప్రధాని మోడీ చొరవ తీసుకున్నారని సీఎం మోహన్ యాదవ్ తెలిపారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 103 మెగావాట్ల జలవిద్యుత్, 27 మెగావాట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 2,000 గ్రామాలకు చెందిన దాదాపు 7.18 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు సాగునీరు పుష్కలంగా అందడంతో పాటు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీరు అందుతుందని వెల్లడించారు. ఈ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో పాటు టూరిజం కూడా అభివృద్ధి చెంది కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. కరువు పీడిత బుందేల్‌ఖండ్ ప్రాంతంలో భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని సీఎం చెప్పారు. ప్రాజెక్ట్ కింద పన్నా టైగర్ రిజర్వ్‌లోని కెన్ నదిపై 77 మీటర్ల ఎత్తు మరియు 2.13 కిలోమీటర్ల పొడవు గల దౌధన్ ఆనకట్ట, రెండు సొరంగాలు నిర్మించనున్నారు. డ్యాంలో 2,853 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ అమలు కోసం ప్రధాని మోడీ సమక్షంలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి మంత్రి త్రైపాక్షిక అవగాహన ఒప్పందం జరిగింది. మార్చి 22, 2021న సంతకాలు చేసుకున్నారు.

# వైకాపా హయాంలో అక్రమ కేసులు లేవు

- నందిగం అరెస్టయి నాలుగు నెలలైనా ఆధారాలు లేవు
- వైకాపా నేత సజ్జల విమర్శలు



అమరావతి,ప్రజాభూమి

అధికార పక్షం టీడీపీపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీని లేకుండా చేసేందుకు టీడీపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ హయాంలో ఇలా వ్యవహరించలేదని అన్నారు. నాలుగేళ్ల తరువాత తాము అధికారంలోకి వస్తే అప్పుడు పార్టీ నేతలు తమ మాట వినకపోవచ్చని అన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ అక్రమ కేసుల్లో అరెస్టై 4 నెలలు అవుతోంది. ఆధారాలు లేకుండా ఆయనపై కేసులు పెట్టారు. ఈ రోజు టీడీపీ వ్యవహరించినట్లు మేము వ్యవహరించలేదు. మా పాలనలో చట్టం తన పని తాను చేసుకుని వెళ్ళింది. కోర్టుల్లో ఉన్న లొసుగులను ఉపయోగించి జైల్లో ఉంచుతున్నారు. జైల్లో మాజీ ఎంపీకి కనీస సదుపాయాలు కల్పించడం లేదు. వాటర్ బాటిల్ కూడా అనుమతించడం లేదు. డైరెక్ట్‌గా ముఖ్యమంత్రి కుమారుడే ఫోన్ చేసి సురేష్‌ను ఎలా ఉంచాలో చెబుతున్నారు. ఇవన్నీ కూడా మౌనంగానే భరిస్తున్నాం.‘ వైసీపీని లేకుండా చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. 30 ఏళ్ళ క్రితం నక్సలైట్లును అరెస్ట్ చేసినట్లు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన వారిని అరెస్ట్ చేస్తున్నారు. వేధించడం అంటే ఎలా ఉండాలో మాకు నేర్పుతున్నారు. ప్రజలు ఇచ్చిన అధికారం ప్రజల కోసమే ఉపయోగించాలి. కూటమి ప్రభుత్వం కక్ష తీర్చుకోవడంలో కొత్త కొత్త పద్దతులు ఉపయోగిస్తోంది. మా కంటే బలంగా కొట్టగలిగిన శక్తి వైసీపీకి ఉంది. నాలుగేళ్ళల్లో మేము అధికారంలోకి వస్తే మా వాళ్ళు చెప్పినా వినే పరిస్థితి ఉండదు‘ ఆయన అని అన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 370 దరఖాస్తులు

హైదరాబాద్,ప్రజాభూమి



మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 370 దరఖాస్తులు అందా యి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107, విద్యుత్ శాఖ కు సంబంధించి 80, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 65, ప్రవాసి ప్రజావాణి సంబంధించి 4, ఇతర శాఖలకు సంబంధించి 114 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# ఎన్నికల పక్రియ నిబంధనల్లో మార్పులు

- సుప్రీంలో సవాల్ చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, ప్రజాభూమి

ఎన్నికల పక్రియకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుత చర్యల కారణంగా ఎన్నికల పక్రియ సమగ్రతకు భంగం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొంది. ఎన్నికల సంఘం ఇటీవల చేసిన సవరణలను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను, వెబ్ కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఏకపక్షంగా ఎన్నికల పక్రియ నిబంధనల్లో మార్పులు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ తెలిపారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను ఏకపక్షంగా తొలగించడం లేదా చేర్చడం వంటి చర్యలకు పాల్పడలేదని కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్‌కు తెలిపింది. ఓటర్ల జాబితా తయారీలో పాదర్శకత, నిబంధనలు పాటించినట్లు పేర్కొంది. మహారాష్ట్రలో ఓటర్ల తొలగింపులో అవతవకలు జరగలేదన్న ఈసీ.. కాంగ్రెస్ ప్రతినిధుల భాగస్వామ్యంతో పాటు తగిన పక్రియను అనుసరించామని వెల్లడించింది. హర్యానా, మహారాష్ట్ర



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత.. ఎన్నికల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని ఆరోపించింది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి కూడా ఫిర్యాదు చేసింది. అయితే కాంగ్రెస్ బృందాన్ని పంపిస్తే.. అనుమానాలు నివృత్తి చేస్తామని ఈసీ తెలిపింది.

# ప్రక్షాళన దిశగా ఏపీ ఫైబర్ నెట్

- అడ్డగోలు నియామకాల్లో 410మంది తొలగింపు
- రామ్‌గోపాల్ వర్మకు చెల్లించిన రూ.1కోటి15లక్షల వాపస్‌కు నోటీస్
- ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీ రెడ్డి వెల్లడి

అమరావతి,ప్రజాభూమి

ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు ఉండటంతో కార్పొరేషన్‌లో 410 మంది ఉద్యోగులను తొలగించే విధంగా కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ఏపీ ఫైబర్ నెట్‌ను ప్రక్షాళన చేస్తున్నామని ÷బైర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీ రెడ్డి స్పష్టం చేశారు. ఫైబర్ నెట్‌లో 410 మంది ఉద్యోగులను తొలగించటానికి నిర్ణయం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. 2016-19 మధ్య 108 ఉద్యోగులతో నడిపామని.. 10 లక్షల కనెక్షన్లు అప్పట్లో ఉన్నాయని.. 2019-24 మధ్య వైసీపీ సమయంలో ఉద్యోగులను 1360కి పెంచారని.. అయినా సంస్థ బిజినెస్ పెరగలేదు, నష్టాలు వచ్చాయని ఆయన తెలిపారు. కనెక్షన్లు ఐదు లక్షలకు పడిపోయాయని జీవీ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో వచ్చిన ఉద్యోగులు అందరూ ఎంపీ అవినాష్ రెడ్డి సహా మరికొందరు నేతల సిఫార్సుతో వచ్చారని.. అవసరం లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిపారని ఆయన విమర్శించారు. ఆఫర్ లెటర్, అపాయింట్‌మెంట్ కూడా లేకుండా ఉద్యోగాలు ఇచ్చారని మండిపడ్డారు. లీగల్ సర్వీస్ కూడా మొత్తం పరిశీలించామని ఆయన తెలిపారు. ఉద్యోగస్తుల విషయంలో ఇబ్బంది లేదని.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఉద్యోగులను మాత్రమే తొలగిస్తున్నామన్నారు. అడ్డగోలుగా తొలగించటం చేయటం లేదన్నారు. ఎగ్జిట్ ఫార్మాట్ ద్వారా ప్రొసీజర్ ద్వారా మాత్రమే ఉద్యోగుల తొలగింపు చేస్తున్నామన్నారు. 410 మంది ఉద్యోగులను ప్రొసీజర్ ప్రకారం మాత్రమే తొలగిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఉద్యోగాలు ఇక్కడ ఉంటాయి తప్ప.. ఉద్యోగులు ఎక్కడో ఉంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత కక్షతో ఉద్యోగాలు తొలగించటం లేదన్నారు. ప్రొసీజర్ ప్రకారం నియామకాలు



జరగటం లేదని.. 2 వేల కోట్లకు పైగా అప్పులు సంస్థకు ఉన్నాయని మండిపడ్డారు. ఉద్యోగం తొలగింపుకు గురైన వారు ఎక్కువ చేస్తే వారి నుంచి జీతాల రికవరీతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. జీతాలు ఇచ్చిన వారు ఎవరైనా వివరణ కోసం నోటీసు ఇస్తామన్నారు. మాజీ ఎండీ నుంచి రికవరీ చేయటానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రామ్ గోపాల్ వర్మ వ్యూహం సినిమా చెల్లింపులపై ఛైర్మన్ జీవీ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో రాంగోపాల్ వర్మకు రూ. 1కోటి15లక్షల రూపాయలు అక్రమంగా చెల్లించారని అన్నారు. రాంగోపాల్ వర్మ కు నోటీసులు ఇచ్చి డబ్బు చెల్లించేందుకు 15రోజులు సమయం ఇచ్చామన్నారు. నిర్ణీత గడువులోగా డబ్బు చెల్లించకపోతే వర్మపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. మరో 200 మంది ఉద్యోగుల అపాయింట్‌మెంట్లను పరిశీలిస్తున్నామని.. 200 మంది ఉద్యోగులను మరికొద్దిరోజుల్లో తొలగింపునకు చర్యలు ఉంటాయన్నారు.

# జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

శ్రీకాకుళం,ప్రజాభూమి

జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. నాటి ప్రభుత్వ వైఫల్యాలు నేటికీ వెంటాడుతున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు .కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో దిశా సమీక్షా సమావేశం మంగళవారం నిర్వ






హించారు. ఈ సమీక్షా సమావేశంలో 20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తమకు రాజకీయ, వ్యక్తిగత కక్షలు ఉండవని చెప్పారు. జలజీవన్ మిషన్, హౌసింగ్ పథకాల్లో అధికారిక లెక్కలకు క్షేత్ర స్థాయి పనులకు పొంతన లేదన్నారు.కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై దిశా సమావేశంలో చర్చించామని అన్నారు. రాష్ట్రం, కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వం ఉండటం ఏపీకి ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుంటామని తెలిపారు. అటల్ బీహారీ వాజపేయి జయంతి కార్యక్రమం ఢిల్లీలో ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. వాజ్‌పేయి మంచి సంస్కరణ వాది అని చెప్పారు. చంద్రబాబు, వాజపేయి కాంబినేషన్లో అనేక సంస్కరణలకు నాంది పలికారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, ప్రజాభూమి

వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. వినియోగదారుల హక్కులు, సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడ్డామని.. ఇక్కడ మోస పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. వినియోగదారుల హక్కులు మర్చిపోయేలా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. టీ పౌడర్ నుంచి కందిపప్పు వరకు కల్తీ జరుగుతుందని తెలిపారు. పిల్లలు తినే చాక్లెట్లలోనూ కల్తీ జరుగుతుందని చెప్పారు. వీటిని నివారించేందుకు అందరు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధాన్యం సేకరణ తర్వాత 24 గంటల్లోనే



ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు. దీపం -2 పథకం ద్వారా 75 లక్షల గ్యాస్ సిలిండర్లు అందించా మని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మాదిరిగానే ప్రతి ప్రైవేట్ సంస్థ జవాబుదారీతనంతో ఉండాలని అన్నారు. చట్టాలు తీసుకువస్తే సరిపోదు, అవి యాకి వ్‌గా ఉండాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పా రు. ఆహార కల్తీ నివారణకు జిల్లాకో ల్యాబ్ ఏర్పాటు కు ఆలోచిస్తున్నామన్నారు. వినియోగదారుల సంక్షేమ ం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చట్టం లోని హక్కులను పౌరులు ఉపయోగించుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.



# జట్టుకు మేలు చేసే నిర్ణయం తీసుకుంటాం

## టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ

ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్ బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ ఎవరా? అనేది సీక్రెట్ అని కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. జట్టుకు మేలు చేసే నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. తన గాయం చిన్నదని, ఫిట్‌గా ఉన్నానని స్పష్టం చేశాడు. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా.. రోహిత్ శర్మ మోకాలికి బంతి బలంగా తాకింది. దాంతో ఫిజియోతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకున్నాడు. ఈ క్రమంలోనే నాలుగో టెస్ట్ రోహిత్ ఆడుతాడా? లేదా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. నాలుగో టెస్ట్ నేపథ్యంలో రోహిత్ శర్మ మంగళవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా తన గాయానికి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చాడు. తీవ్రమైన గాయం కాదని, తన మోకాలు బాగానే ఉందని చెప్పాడు. 'నా గాయం చిన్నదే. నేను ఫిట్‌గానే ఉన్నాను. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ గురించి ఆలోచించకండి. కొన్ని విషయాలు బయటపెట్టాలి. మరికొన్ని దాచిపెట్టాలి. జట్టుకు ఏది మంచిదో అదే చేస్తాం. టీమిండియా ఓపెనర్ ఎవరా? అనేది సీక్రెట్. విరాట్ కోహ్లీ తన ఆఫ్ స్టంప్ బలహీనతను అధిగమించే ప్రయత్నం చేస్తున్నాడు. యశస్వి జైస్వాల్ సహజ శైలిలో ఆడుతాడు. అతనికి స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వాలి. అతను మా అందరి కంటే తన బ్యాటింగ్‌ను బాగా అర్థం చేసుకుంటాడు.'అని రోహిత్ శర్మ తెలిపాడు. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్‌కు కూడా రోహిత్ అండగా నిలిచాడు.'అడిలైడ్ వేదికగా జరిగిన టెస్ట్‌లో శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేశాడు. కానీ భారీ స్కోర్లుగా మల్చలేకపోయాడు. మా కుర్రాళ్ల ఆశావహుల్లో గిల్ ఒకడు. ప్రతీసారి భారీ స్కోర్లు చేయడం అంత సులువైన పనికాదు. గిల్ నాణ్యమైన ఆటగాడు. అతను బ్యాటింగ్‌ను అర్థం చేసుకుంటాడు. భారత జట్టులోకి రాకముందు అతను చాలా పరుగులు చేశాడు.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.రిషభ్ పంత్ ఫామ్‌పై కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రోహిత్ శర్మ తెలిపాడు. 'ఇటీవల రిషభ్ పంత్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రానా అతనిపై ఓ నిర్ణయానికి రావడం సరికాదు. ఏం చేయాలో అతనికి బాగా తెలుసు. భారత ఆటగాళ్లంతా ఒకే పడవలో ఉన్నాడు. వారు చేసే పనిని క్లిష్టతరం చేయాల్సిన అవసరం లేదు. జట్టు కోసం ఏం చేయాలో వారికి బాగా తెలుసు.'అని రోహిత్ బదులిచ్చాడు.

# కేఎల్ రాహుల్ హ్యాట్రిక్ సెంచరీ సాధించేనా?



ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న టీమిండియా డిసెంబర్ 26 నుంచి నాలుగో టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఈ బాక్సింగ్ డే టెస్టు మ్యాచ్‌లో కన్నడిగు కేఎల్ రాహుల్ హ్యాట్రిక్ సెంచరీ పూర్తి చేసే అవకాశం ఉంది. నిజానికి, ఇప్పటివరకు ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా అత్యంత ప్రభావవంతమైన, విజయవంతమైన బ్యాట్స్‌మెన్‌లలో కేఎల్ రాహుల్ ఒకడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియన్ స్టార్ ట్రావిస్ హెడ్ తర్వాత ఏ బ్యాట్స్‌మెన్ అయినా నిలకడగా రాణించాడంటే అది రాహుల్ మాత్రమే. సిరీస్ ప్రారంభానికి ముందు రాహుల్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవడంపై అందరూ ప్రశ్నలు లేవనెత్తారు. అయితే, ఇప్పుడు అందరూ అతనిని ప్రశంసిస్తున్నారు. రాహుల్ ఇప్పటివరకు కొన్ని బలమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. కానీ, అతని బ్యాట్ నుంచి ఒక్క సెంచరీ కూడా రాలేదు. అయితే, మెల్ బోర్న్ వేదికగా జరగనున్న నాలుగో టెస్టులో రాహుల్ హ్యాట్రిక్ సెంచరీలు పూర్తి చేసే అవకాశం ఉంది. బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌లో ఇప్పటికే రెండు బలమైన అర్ధసెంచరీలు సాధించిన రాహుల్ నుంచి ఇప్పుడు భారీ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. బహుశా ఈ నిరీక్షణ మెల్‌బోర్న్‌లోనే ముగుస్తుంది. నిజానికి, రాహుల్ గత రెండు వరుస బాక్సింగ్ డే టెస్టుల్లో సెంచరీ సాధించగా, ఇప్పుడు మూడో టెస్టులో సెంచరీ పూర్తి చేస్తే రాహుల్ హ్యాట్రిక్ సెంచరీలు పూర్తి చేస్తాడు. గతంలో దక్షిణాఫ్రికాలో జరిగిన 2 బాక్సింగ్ డే టెస్టుల్లో రాహుల్ రెండు సెంచరీలు సాధించాడు. 2021లో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో 123 పరుగుల ఇన్నింగ్స్ ఆడిన రాహుల్.. ఆ తర్వాత గతేడాది 2023లో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో 101 పరుగులు చేశాడు. ఈ రెండు టెస్టుల్లోనూ టీమిండియా అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా నిలిచాడు. యాదృచ్ఛికంగా, రెండు మ్యాచ్‌లు సెంచూరియన్‌లోనే జరిగాయి. ఇప్పుడు మెల్‌బోర్న్‌లో రాహుల్ ఈ విజయాన్ని పునరావృతం చేస్తే హ్యాట్రిక్ సెంచరీ రికార్డును లిఖించనున్నాడు. ఆశ్చర్యకరంగా, రాహుల్ టెస్టు కెరీర్ ఇదే బాక్సింగ్ డే టెస్టుతో ప్రారంభం కావడం ఇక్కడ గమనార్హం. అతను డిసెంబర్ 2014లో బాక్సింగ్ డే నాడు తన టెస్టు అరంగేట్రం చేశాడు. అయితే, ఆ మ్యాచ్ మెల్‌బోర్న్‌లో మాత్రమే జరిగింది. ఇందులో రాహుల్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 పరుగులు, 2వ ఇన్నింగ్స్‌లో 1 పరుగు మాత్రమే చేశాడు.

## అండర్ 19 ప్రపంచకప్

# జట్టులోకి గొంగడి త్రిష

### మహిళల అండర్ 19 టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన



మహిళల అండర్ 19 టీ20 ప్రపంచకప్ టోర్నీలో బరిలోకి దిగే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను మహిళా సెలెక్షన్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఈ జట్టుకు నిక్కీ ప్రసాద్ సారథ్యం వహించనుండగా.. సానికా చల్కే డిప్యూటీగా వ్యవహరించనుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు అమ్మాయిలకు ఈ జట్టులో చోటు దక్కింది.హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష, కేసరి ధృతితో పాటు విశాఖపట్టణానికి చెందిన షబ్నమ్ అండర్ 19 ప్రపంచకప్‌కు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన మహిళల అండర్ 19 ఆసియా కప్ టోర్నీలో ఈ ముగ్గురు మెరుగైన ప్రదర్శన చేశారు. గొంగడి త్రిష హాఫ్ సెంచరీతో చెలరేగి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకుంది. అండర్ 19 ప్రపంచకప్ జట్టులోకి ఇద్దరు వికెట్ కీపర్లను తీసుకున్నారు. మరో ముగ్గురు ప్లేయర్లను స్టాండ్ బైగా ఎంపిక చేశారు. మలేసియాలోని కౌలాలంపూర్ వేదికగా జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఈ టోర్నీ జరగనుంది. మొత్తం 16 జట్లు బరిలో కి దిగగా.. నాలుగు గ్రూప్‌లు విభజించారు. ప్రతీ గ్రూప్ లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-6కు క్వాలిఫై అవుతాయి. సూపర్ సిక్స్‌లో రెండు గ్రూప్ ల్లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుతాయి. గ్రూప్-ఏలో మలేసియా, శ్రీలంక, వెస్టండీస్‌తో ఉన్న భారత్ ఉంది. జనవరి 19న వెస్టిండీస్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 21న మలేసియా రెండో మ్యాచ్, జనవరి 23 శ్రీలంకతో మూడో మ్యాచ్‌లో తలపడనుంది. అండర్ 19 స్థాయిలో ఇది రెండో మహిళా టీ20 ప్రపంచకప్ కాగా.. 2023లో జరిగిన అరంగేట్ర అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది. భారత జట్టు: నిక్కీ ప్రసాద్(కెప్టెన్), సానికా చల్కే(వైస్ కెప్టెన్), గొంగడి త్రిష, కమిలిని జి(వికెట్ కీపర్), భవికా అహిరె(వికెట్ కీపర్), ఈశ్వరి అవసరె, మిథిలా వినోద్, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పర్ణికా సిసోదియా, కేసరి ధృతి. ఆయుషి, శు క్లా, అనందితా కిశోర్, షబ్నమ్, వైష్ణవి.స్టాండ్ బై ప్లేయర్లు:నందన, ఐరా, అనధి




అందుకే రిటైర్మెంట్ ప్రకటించా
టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

తనలోని సృజనాత్మకతకు భవిష్యత్తు లేదనిపించడంతోనే రిటైర్మెంట్ ప్రకటించానని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం టీమిండియాతో కలిసి ఆసీస్ పర్యటనకు వెళ్లిన అశ్విన్.. గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో అందరూ అవాక్కయ్యారు. ఇంత త్వరగా.. సిరీస్ మధ్యలో అశ్విన్ ఎందుకు రిటైర్మెంట్ తీసుకున్నాడని తర్జన భర్జనలు పడ్డారు. ఏదో అసంతృప్తితోనే తప్పుకున్నాడని కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అశ్వినే స్వయంగా తన రిటైర్మెంట్ గల కారణాన్ని వెల్లడించాడు. ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ.. తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నేను ఏ విషయాన్నైనా పెద్దగా సాగతీయను. జీవితంలో ఏ రోజు కూడా అభద్రతా భావానికి గురి కాలేదు. ఈ రోజు నాకు దక్కింది. రేపు కూడా నా వద్దే ఉంటుందని ఏ మాత్రం నమ్మను. ఈ ఆలోచన విధానమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నేను చాలా పెద్దగా ఆలోచిస్తాను. నా గురించి జనాలు సంబరాలు చేసుకుంటున్నారంటే అస్సలు నమ్మను. నా కంటే ఆటే గొప్పదని భావిస్తాను. నా రిటైర్మెంట్‌పై నేను చాలా సార్లు ఆలోచించాను. ఏ రోజైనా నిద్ర లేవగానే నాలోని సృజనాత్మకతకు భవిష్యత్తు లేదనుకుంటే అదే రోజు నేను ఆటను వదిలేస్తాను. హఠాత్తుగా ఎందుకో నాకు ఆ రోజు అలాగే అనిపించింది. అందుకే వదిలేశాను. ఆట కోసం నా సర్వస్వం ఇచ్చాను. గత కొన్నేళ్లుగా విభిన్నమైన నైపుణ్యాలు, ప్రతిభతో చాలా క్రికెట్ ఆడాను. నా ఆట గురించి ఇతరులకు చెప్పగలగడం చాలా ప్రత్యేకమైంది. మనల్ని మనం అన్వేషించుకొంటేనే అది సాధ్యమవుతోంది. ఆట గురించి మాట్లాడే విస్తృతమైన పరిజ్ఞానాన్ని నాకు ఇచ్చింది. రిటైర్మెంట్ ప్రకటించినందుకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. ఎందుకంటే అది పూర్తిగా నా నిర్ణయం. క్రికెట్ నాకు చాలా ఇచ్చినందుకు సంతోషంగా ఉంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇతర కెప్టెన్ల కన్నా ధోనీ సారథ్యం విభిన్నంగా ఉంటుందని చెప్పాడు.'ధోనీ ప్రాథమిక విషయాలను బాగా చేస్తాడు. కానీ, చాలా మంది కెప్టెన్లు వాటిని పెద్దగా పట్టించుకోరు. దాంతో మ్యాచ్ వారికి సమస్యగా మారిపోతుంది. ధోనీ బౌలర్ చేతికి బంతిని ఇస్తూనే అవసరమైన ఫీల్డింగ్ పేటుకోమని చెబుతాడు. అందుకు తగ్గట్లు బంతులు వేయమంటాడు. కొన్నిసార్లు బ్యాటర్లు.. బౌలర్ల లూజ్ డెలివరీలను బౌండరీ బాదినా ఏమనడు. బౌలింగ్ నుంచి తప్పించడు. కానీ నా బౌలింగ్‌లో ఎవరైనా కట్ లేడ్ డ్రైవ్ షాట్ ఆడితే మాత్రం ధోనీ కోప్పడుతాడు. బౌలింగ్ కూడా ఇవ్వడు. ఇలాంటి ప్రాథమిక విషయాల్లో ధోనీ కఠినంగా ఉంటాడు కాబట్టే ధోనీ సక్సె స్ అయ్యాడు.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

## నా సృజనాత్మకతకు భవిష్యత్తు లేదు

# ఫిబ్రవరి 19 నుండి ప్రారంభం

### కరాచీలో న్యూజిలాండ్ , పాకిస్తాన్‌ల మధ్య మొదటి మ్యాచ్
### మార్చి 9న జరగనున్న ఫైనల్ సమరం




క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. మినీ వరల్డ్ కప్ గా భావించే ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం (డిసెంబర్ 24) ప్రకటించింది. ఈ మేరకు ఐసీసీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ను రిలీజ్ చేసింది. నిజానికి ఈ టోర్నీ షెడ్యూల్ ఇప్పటికే విడుదలై ఉండాల్సింది. కానీ టోర్నీ నిర్వహణ విషయంలో భారత్, ఆతిథ్య పాకిస్థాన్ మధ్య నెలకొన్న గందరగోళం కారణంగా ఈ షెడ్యూల్ విడుదల కాలేదు. ఎట్టకేలకు ఈ రెండు దేశాల డిమాండ్లను పరిగణణలోకి తీసుకున్న ఐసీసీ మంగళవారం టోర్నీ అధికారిక షెడ్యూల్ ను రిలీజ్ చేసింది .ఈ టోర్నీలో ఫైనల్‌తో కలిపి మొత్తం 15 మ్యాచ్‌లు జరగనున్నాయి. మొత్తం 8 జట్లు ఈ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. ఈ 8 జట్లను 4-4 ప్రకారం 2 గ్రూపులుగా విభజించారు. %×జజ% విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుండి ప్రారంభమవుతుంది. మొదటి మ్యాచ్ న్యూజిలాండ్, ఆతిథ్య పాకిస్తాన్ జట్ల మధ్య కరాచీ వేదికగా జరుగుతుంది. మార్చి 9న ఫైనల్ జరగనుంది. టీమ్ ఇండియా తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. ఇక టోర్నీలో భాగంగా ఫిబ్రవరి 23న దుబాయ్ వేదికగా భారత్-పాకిస్థాన్‌ల మధ్య హైవోల్టేజీ మ్యాచ్ జరగనుంది. లీగ్ రౌండ్‌లో చివరి మ్యాచ్‌లో భారత్ మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

**ఐసీసీ రిలీజ్ చేసిన షెడ్యూల్ ప్రకారం..**

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఏలో పాకిస్థాన్, భారత్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, గ్రూప్ బీలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ ఉన్నాయి. భారత జట్టు తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. ఒకవేళ రోహిత్ సేన ఫైనల్‌కు చేరితే అది కూడా లాహోర్‌లో కాకుండా దుబాయ్‌లో జరుగుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు రిజర్వ్ డేని నిర్ణయించారు. మార్చి 9న ఫైనల్ జరగకపోతే మార్చి 10న మ్యాచ్ జరగనుంది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ-ఫైనల్ కు రిజర్వ్ డే లేదు. అన్ని ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతాయి.



నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యతగా వ్యవహరిస్తున్న సూపర్ హిట్ టాక్ షో 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే'. ఇప్పటికే మూడు సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకున్న ఈ షో నాలుగో సీజన్‌లో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. నాలుగో సీజన్‌లో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, అల్లు అర్జున్, తమిళ నటుడు సూర్యలతో పాటు నవీన్ పొలిశెట్టి తదితరులు వచ్చి సందడి చేశారు. ఇప్పుడు తాజాగా ఈ షోకి వెంకీ మామ రాబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో భాగంగా.. వెంకటేశ్ 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే'షోకి వచ్చి సందడి చేశాడు. వెంకటేశ్‌తో పాటు అన్న సురేష్ బాబు, దర్శకుడు అనిల్ రావిపూడి కూడా వచ్చి అల్లరి చేశారు. కాగా ఈ వీడియోను మీరు చూసేయండి.

# బాలకృష్ణతో సందడి చేసిన వెంకటేశ్

# మరోసారి కెమెరాకు చిక్కిన విజయదేవరకొండ, రష్మిక



టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ప్రేమలో ఉన్నారంటూ గత కొంతకాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట పర్సనల్ లైఫ్‌లో చాలా సన్నిహితంగా ఉంటారు. ఇరు కుటుంబాల మధ్య కూడా చక్కటి స్నేహసంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరి లవ్ ఎఫైర్‌పై అనేక కథనాలొచ్చాయి. అయితే తాము కేవలం స్నేహితులం మాత్రమేనని, తమ మధ్య ఎలాంటి ప్రేమబంధం లేదని ఈ తారలిద్దరూ అనేక సందర్భాల్లో వివరణ ఇచ్చారు. అయితే తాజాగా వీరిద్దరూ కలిసి వెళుతున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఈ జంట ముంబయి విమానాశ్రయంలో తళుక్కున మెరిసింది. సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించగా.. కెమెరాలు క్లిక్ మనిపించాయి. మొదట రష్మిక ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి మీడియాకి ఫోజులిచ్చింది. అనంతరం కాసేపటికే మరో కారులో నుంచి విజయ్ దేవరకొండ దిగాడు. వీరిద్దరూ క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం విదేశాలకు వెళుతున్నట్లు సమాచారం. సినిమాల విషయానికి వస్తే.. విజయ్ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేస్తున్నాడు. పుష్ప 2 ది రూల్ హిట్ అందుకున్న రష్మిక ప్రస్తుతం విక్కీ కౌశల్‌తో చావా అనే సినిమాలో నటిస్తుంది.


## 27న ఓటీటీలోకి ఆర్‌ఆర్‌ఆర్ డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్, హాలీవుడ్ బ్యూటీ ఒలివియా కథానాయికలుగా నటించారు. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా మేకింగ్ వీడియోను డాక్యుమెంటరీ రూపంలో తీసుకువచ్చిన విషయం తెలిసిందే. 'ఆర్‌ఆర్‌ఆర్- బిహైండ్ అండ్ బియాండ్' అంటూ వచ్చిన ఈ డాక్యు ఇటీవలే ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ స్క్రీన్‌లలో విడుదలై మంచి కలెక్షన్లు రాబట్టింది. అయితే ఈ చిత్రం తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 27 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్ విడుదల చేసింది. ఈ డాక్యుమెంటరీ రన్ టైం 1 గంట 38 నిమిషాలు ఉంది.

### ప్రేక్షకుల ముందుకు మాక్స్‌తో రాబోతున్న

## కిచ్చా సుదీప్ విక్రాంత్ రోన




ఈగ ఫేం, కన్నడ స్టార్ యాక్టర్ కిచ్చా సుదీ ప్ విక్రాంత్ రోన తర్వాత ప్రేక్షకుల ముందు కు రాబో తున్న చిత్రం మాక్స్. విజయ్ కార్తికేయన్ డైరెక్ట్ (డెబ్యూ) చేస్తున్న మాక్స్ మూవీ టైటిల్ టీజర్ ఇప్పటికే నెట్టింట వైర ల్ అవుతోంది. ఈ చిత్రం డిసెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.మా పొలిటి కల్ కెరీర్‌కు ఈ రాత్రి చాలా ఇంపార్టెంట్.. అంటూ సాగే డైలాగ్స్‌తో మొదలైంది ట్రైలర్. సార్ మా అమ్మాయి కనబడటం లేదండి.. ఒక్కతే కూతురు సార్ అని ఓ తల్లి వేడు కుంటోంది. ఈ ఒక్క రోజు రాత్రే స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపడుతాం. సేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చే ప్రతీ పకోడిగాడు సమా జసేవ కుడే.. మొత్తం క్లీన్ చేద్దాం.. అంటూ సాగుతున్న సంభాషణలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఇప్పటికే లాంచ్ చేసిన మాక్స్ గ్లింప్స్‌లో.. రాబోయే వాళ్ళు అగ్ని పర్వతం నుంచి తప్పించుకోవచ్చు. భూకంపం నుంచి తప్పించుకోవచ్చు.. తుఫాన్ నుంచి తప్పించుకోవచ్చు. సునామీ నుంచి కూడా తప్పించుకోవచ్చు కానీ వీడితో పెట్టుకుంటే సావు లేని వరంతో పుట్టినోడు కూడా చచ్చిపోతాడు.. అంటూ కిచ్చాసుదీప్ క్యారెక్టర్‌ను ఎలివేట్ చేసే సన్నివేశాలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి.

## పబ్లిసిటీకి దూరంగా స్టార్ కమెడియన్.. రీజన్ అదేనా?



2024 ఏడాది చివరి వారాంతంలో ప్రేక్షకులకు వినోదాల విందును అందించడానికి పలు సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. క్రిస్మస్ హాలిడేస్ ని క్యాష్ చేసుకోవాలని బాక్సాఫీస్ బరిలో దిగుతున్న చిత్రాలలో "శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్" కూడా ఒకటి. డిసెంబర్ 25వ విడుదల కాబోతోంది. అంతకంటే ముందుగా మంగళవారం సాయంత్రమే కొన్ని ఏరియాలలో ఎర్లీ బర్డ్స్ షోస్ పేరుతో పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నారు. అయితే ఈ మూవీలో ప్రధాన పాత్ర పోషించిన స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ ప్రమోషనల్ ఈవెంట్స్‌లో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్" సినిమా ప్రమోషనల్ కంటెంట్ లో వెన్నెల కిషోర్ ను హైలైట్ చేస్తూ వచ్చారు మేకర్స్. ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్, ఇతర పోస్టర్స్.. ఇలా అన్నిట్లో అతన్నే ప్రధానంగా చూపించారు. దీంతో ఈ సినిమాలో హీరో కిషోర్ అని అందరూ ఫిక్స్ అయ్యారు. కానీ ప్రచార కార్యక్రమాల్లో మాత్రం వెన్నెల కిశోర్ ఎక్కడా కనిపించలేదు. ఈ క్రమంలో సినిమా ప్రచారానికి సహకరించడం లేదంటూ పుకార్లు కూడా పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న కిషోర్.. ఇప్పటికే దీనిపై వివరణ ఇచ్చారు. తాను సినిమాలో హీరో కాదని స్పష్టం చేసారు. అయితే హీరో పాత్ర అయినా కాకపోయినా మూవీ ప్రమోషన్స్ కు సహకరించాలి కదా అనే వాదన వినిపిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకునే హాస్యనటులలో వెన్నెల కిషోర్ ఒకరు. తన మార్క్ కామెడీ టైమింగ్ తో నవ్వులు పూయించే కిషోర్.. చేతినిండా సినిమాలతో ఏడాది పొడవునా బిజీగా ఉండే క్యారక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. వర్క్ విషయంలో చాలా ప్రొఫెషనల్ గా ఉంటాడు. వివాదాలకు దూరంగా ఉండటానికి ఇష్టపడతాడు. తన పనేదే తాను చేసుకుంటూ వెళ్లిపోతుంటాడు. ప్రమోషన్స్, ప్రీ-రిలీజ్ ఈవెంట్లలో చాలా అరుదుగా కనిపిస్తాడు కిషోర్. సహజంగానే ఇంట్రావర్ట్ కావడంతో ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటారని తెలుస్తోంది. అప్పుడప్పుడు ఆయన ప్రధాన పాత్ర పోషించిన కొన్ని సినిమాలకు మాత్రం రికార్డెడ్ ఇంటర్వ్యూలు ఇస్తుంటారు. అనవసరమైన వివాదాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ప్రెస్ మీట్ లను అవైడ్ చేస్తారనే టాక్ ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో వెన్నెల కిషోర్ హీరోగా నటించిన 'చారి 111' అనే సినిమా వచ్చింది. ఈ మూవీ ప్రమోషన్స్ లోనూ అతను ఎక్కడా కనిపించలేదు. ఇప్పుడు 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' ప్రచారానికి కూడా రాలేదు. అయితే ప్రమోషన్స్ కు రమ్మని వెన్నెల కిషోర్ ను ఒకటీ రెండు సార్లు రిక్వెస్ట్ చేసినా, సాధ్యపడలేదని నిర్మాత వంశీ నందిపాటి తెలిపారు. ఇంటర్వ్యూలకి, ఈవెంట్స్ కి తనని దూరంగా ఉంచమని ముందుగానే చాలా జెంటిల్ గా సాఫ్ట్ గా చెబుతాడని అన్నారు. ఒక కామన్ ఇంటర్వ్యూ మాత్రం ఇచ్చాడని చెప్పారు. సినిమాలో హీరో వెన్నెల కిషోర్ కాదని, ఒక ప్రధాన పాత్ర పోషించాడని, ఈ సినిమాకి కథే హీరో అని తెలిపారు. అయితే వెన్నెల కిషోర్ మూవీ ప్రమోషన్లకు దూరంగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. రెమ్యూనరేషన్ తీసుకున్నప్పుడు, అవసరమైనప్పుడు సినిమాను ప్రమోట్ చేయడం నటీనటుల బాధ్యత అనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమా హిట్ అయితే ముందుగా పేరొచ్చేది.. మరికొన్ని ప్రాజెక్ట్స్ చేతికి వచ్చేది వెన్నెల కిషోర్ కే. కాబట్టి ఆయన కూడా ప్రచారంలో పాల్గొంటే బాగుండేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ కోసం ఏడు రోజుల కాల్షీట్స్ చాలని చెప్పి, 10 రోజులు తీసుకున్నారని వెన్నెల కిషోర్ చెబుతున్నారు. స్క్రీన్ ప్లే మార్పించి మళ్లీ కొత్తగా డబ్బింగ్ చెప్పించారని తెలిపారు. పబ్లిసిటీకి రావడం లేదని అంటున్నారు

# నెట్టింట ఇనయ సుల్తానా ఆమె ప్రియుడు ఫొటోలు వైరల్

## - రోమాంటిక్ ఫొటోలు షేక్ చేసిన ఇనయ



తన తాజా ప్రియుడు గౌతమ్ కొప్పిశెట్టితో బరితెగిస్తూ ఇనయ సుల్తానా వదిలిన ఫొటోలు, వీడియోలు అప్పట్లో పెనుదుమారం రేపాయి. బీచ్‌లో.. బెడ్ రూం.. కిచెన్‌లో.. పబ్‌లో గబ్బులేపుతూ విచ్చలవిడిగా రొమాన్స్ చేసుకుంటూ వీళ్లు వదిలిన హాఫ్ న్యూడ్ ఫొటోలను చూసి బాబోయ్ ఇంత బరిస్తున్నారేంట్రా బాబూ.. వీళ్లు ఎక్కువ కాలం కలిసి ఉండే బాపతులా లేదు అని వీళ్ల సయ్యాటలపై చాలామంది సెటైర్లు వేశారు. అయితే నాలుగు నెలలు తిరిగేసరికి ఆ సెటైర్లే నిజం అయ్యాయి. తన ప్రియుడు గౌతమ్‌కి బ్రేకప్ చెప్పేసినట్టు ఉంది ఇనయా సుల్తానా. ఆమె ఈమెకి బ్రేకప్ చెప్పాడో.. లేదంటే ఈమే అతనికి బ్రేకప్ చెప్పిందో ఏమో కానీ.. తాను సింగిల్ అంటూ విరహవేదనతో రగిలిపోతున్న వరుస పోస్ట్‌లను షేర్ చేసింది ఇనయా సుల్తానా. అంతేకాదు.. తన ప్రియుడితో పెనవేసుకుని ఉన్న ఫొటోలన్నింటినీ డిలీట్ చేసి పారేసింది. అటు గౌతమ్ కూడా.. ఇనయాతో పెనవేసుకుని ఉన్న ఫొటోలన్నీ డిలీట్ చేసి పారేశాడు. నా లైఫ్, నా ఛాయిస్, నా ప్రాబ్లమ్స్, నా తప్పులు, నా పాఠాలు. మీరు నా గురించి మాట్లాడే ముందు మీ సొంత సమస్యలపై దృష్టిపెట్టండి. నా జీవితం గురించి చెప్పడానికి ఇది నీ కథ కాదు' అంటూ కొటేషన్లు రాస్తుంది ఇనయా. ఫైనల్‌గా బ్రేకప్ సింబల్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే.. ప్రియుడితో పెటాకులు అయ్యిందనే విషయాన్ని చెప్పకనే చెప్పింది. ప్రస్తుతం ఇనయా సుల్తానా.. ఇయర్ ఎండింగ్ కావడంతో ఫారిన్ ట్రిప్‌లో ఉన్నట్టు ఉంది. అక్కడ హోటల్స్ రూం నుంచి ఫొటోలు, వీడియోలు వదలుతుంది. సింగిల్ గర్ల్.. సింగిల్ గర్ల్ అని. దీంతో మేం ముందే ఊహించాం కదా.. ఇలాంటిదేదో జరుగుతుందని. మీ రెచ్చిపోవడాలు చూసిన తరువాత.. బుద్ధిన్నోడు ఎవడూ కూడా మీరు కలిసి ఉంటారని మాత్రం అనుకోరు. చివరికి అదే అయ్యింది. ఇంతకీ తమ్ముడు (గౌతమ్) కనిపించడం లేదు.. బ్రేకప్ చెప్పేశావా? చెప్పే ఉంటావ్‌లే' అంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ఇక ఇనయా, గౌతమ్‌లు ఆ మధ్య గోవా వెళ్లి.. బెడ్ రూంలో హాఫ్ న్యూడ్‌గా ఉండి.. రొమాన్స్ చేసుకుంటూ ఆ ఫొటోలను సోషల్ మీడియాలో వదిలారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. కేవలం మీ బంధం బెడ్ రూం వరకేనా? పెళ్లి గట్రాలు ఏమైనా ఉన్నాయా? అని యాంకర్ శివ లాంటోడు ఓ ప్రశ్న వేయగా.. అప్పట్లోనే ఈ యవ్వారం కొన్నాళ్ల వరకే అనేట్టుగా సమాధానం ఇచ్చాడు ఇనయ ప్రియుడు గౌతమ్.పెళ్లా.. అబబ్బే.. అలాంటి ఉద్దేశం మాకు ఇప్పుడైతే లేదు. అయినా మేమిద్దరం చిన్నపిల్లలం. మా గోల్స్ అచీవ్ చేసిన తరువాత పెళ్లి చేసుకుంటేనే మాకు సంతృప్తి.. అప్పటి వరకూ మాకు ఇదే తృప్తి' అని అన్నాడు గౌతమ్. మా రిలేషన్ గురించి చాలామంది కామెంట్లు పెడుతున్నారు. వీళ్లు ఎంత కాలం కలిసి ఉంటారులే అని అంటున్నారు. వాటిని నేను కేర్ చేయను. అయినా మా రొమాంటిక్ ఫొటోలు బాగున్నాయి కదా చూసి ఆనందించాలి.. కానీ ఇలా బ్యాడ్ కామెంట్స్ పెట్టడం ఏంటి?